ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 17 మే 2025



ఉష్ణోగ్రత (అంచనా)

17-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	39	26
బాపట్ల	37	28
రెంటచింతల	39	25
చీరాల	37	28



నరసరావుపేట : మొక్కజొన్న కల్లంలో నిలిచిన నీరు



వేటపాలెం మండలం దేశాయిపేట వద్ద రోడ్డుపై పడిన చెట్టు



గుంటూరు : బస్టాండ్ గ్యారేజీలో చేరిన వర్షపునీరు



కొల్లూరు : గాజుల్లంక వద్ద వర్షానికి తడిసిన పచ్చి ఇటుక

- పలుప్రాంతాల్లో అర్ధరాత్రి బీభత్సం
- బాపట్ల,గుంటూరులో జిల్లాలో కుండపోత
- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం... మురుగుతో రోడ్లు దుర్గంధం
- విద్యుత్, తాగునీటి సరఫరా లేక ప్రజల అవస్థలు

ఉరుములు.. పిడుగులు



గుంటూరులో కంకరగుంట అండర్ బ్రిడ్జిలో చేరిన వర్షపు నీరు



యడ్లపాడు : కొత్తపాలెంలో నేలవాలిన దొండ పందిళ్లు

అచ్చంపేటలో 7.25 సె.మీ వర్షపాతం

అచ్చంపేటలో 7.25 సెమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపిం ది. మండలాల వారీగా వర్షపాతం అమరావతి 43.5 మీమీ, యడ్లపాడు మండలంలో 39.2 మీమీ, బెల్లంకొండ 34.3 మీమీ, క్రోసూరు 31.3, సత్తెనపల్లి 33.5 మీమీ, గురజాల 32.5, నకరికల్లు 31.4, నరసరావుపేట 38.7, శావల్యాపు రం 25.3, బొల్లాపల్లి 29.4 మీమీ, మా చర్ల 23.4 మీమీ, వెల్దుర్తి 22.8, దుర్గి 24.6, రెంటచింతల 26.9, కారంపూడి 30.7, పిడుగురాళ్ల 25.8, దాచేపల్లి 25, మాచవరం 20.3, పెదకూరపాడు 21.5, రాజుపాలెం 31.5, వినుకొండ 24.1, నూ జెండ్ల 31.6, ఈపూరు 28.3, రొంపిచర్ల 19.6, ముప్పాళ్ల 25.1, నాదెండ్ల 19.6, చిలకలూరిపేట 27.5 మీమీ వర్షపాతం నమోదైంది.

గుంటూరులో భారీ వర్షం

గుంటూరులో 82.5, తుళ్లూరులో 78, మంగళగిరిలో 71, తాడికొండలో 32.5, పొన్నూరులో 20.5, దుగ్గిరాలలో 17.5, ఫిరంగిపురంలో 12.5, తాడేపల్లి లో 10.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బాపట్ల, గుంటూరు, నరసరావుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉరుములు.. మెరుపులు.. పిడుగులు.. గాలి వాన.. అర్ధరాత్రి అందరూ ఆదమరిచి నిద్రిస్తున్న వేళ బీభత్సం. నిశీరాత్రిలో భీకరమైన శబ్దంతో ఉరుములు, కళ్లు మిరు మిట్లు గొలిపేలా ఆకాశంలో మెరుపులు, ఈదురుగాలితో కూడిన జోరు వర్షంతో గుంటూరు, బాపట్ల జిల్లా, పల్నాడు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు వణికిపోయారు. నడి వేసవిలో వాతావరణ శాఖ అంచనాకు మించి ఈదరు గాలులతో కూడిన వర్షం పడింది. గుంటూరు జిల్లాలో శుక్ర వారం వేకువజామునకు ముందు 2 గంటల తర్వాత నుంచి ప్రారంభమైన ప్రకృతి విపత్తు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. బాపట్ల జిల్లాలో తెల్లవారుజామున నాలుగుగంటల సమ యంలో మొదలైన వర్షం దాదాపు మూడు గంటల పాటు కుండపోతగా కురిసింది. పలుచోట్ల పిడుగులు పడగా గాలి కారణంగా వర్షం పెద్దగా కురవదేమోనని అంతా భావిం చగా అందుకు విరుద్ధంగా భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా వర్షంతో లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఈదురుగాలులకు చెట్లు, రేకుల షెడ్లు, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు, తోపుడు బండ్లు, టీ కొట్లు బల్లలు కూడా కొంతదూరం కొట్టుకుపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, దీనిపై తాగునీటి సరఫరా ఆధార పడి ఉండటంతో రెండింటికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం వర్షం వెలిశాక విద్యుత్ సిబ్బంది సహాయక చర్యలను ప్రారంభించినా కొన్ని ప్రాంతాల్లో సాయంత్రానికి కూడా విద్యుత్ పునరుద్ధరణ సాధ్యం కాలే దు. దీంతో ప్రజలు అటు కరెంటు లేక.. ఇటు తాగునీటి సర ఫరా లేక రోజంతా అల్లాడిపోయారు. గాలికి భారీ వర్షం జత కలవడంతో రాత్రి అంతా విద్యుత్ సరఫరాని నిలిపే యడంతో ప్రజలు జాగారం చేయాల్సి వచ్చింది. ఉదయం 7 గంటల వరకు అడపాదడపాగా వర్షం కురుస్తూనే ఉన్నది. అన్ని ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షాలు కురవడంతో వాతా వరణం చల్లబడి వారం రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఉపశమనం పొందారు.

- పల్నాడు జిల్లా అంతటా గురువారం అర్ధరాత్రి నుంచి కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిశాయి. కల్లాల్లోని పంటలు తడిచిపోయి అన్నదాతలు నష్టపోయారు. అచ్చంపేటలో భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి అమరావతి మండల పరిధి లోని మండెపూడిలో సభావత్ సాంబయ్య నాయక్ కు టుంబ సభ్యులు ఇంటిలో నిద్రిస్తుండగా ఆకస్మాత్తుగా పిడు గు పడగా వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే ఇల్లు పూర్తిగా దెబ్బతింది.
- నిజాంపట్నం మండలంలోని అడవుల దీవి గ్రామంలో ఉన్న దేవాలయంలో గాలులకు ధ్వజస్తంభం విరిగి పడింది. చీరాలలోని పలువీధులు వర్షపునీటితో తటాకాలను తల పించాయి. వేటపాలెం మండలం దేశాయిపేట వద్ద గాలు లకు చెట్టు నేలకొరిగి రోడ్డుమీద పడడంతో రవాణా స్తం భించింది. పర్చూరురోడ్డులోని పూసపాడు సమీపంలోని నక్కల వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. బాపట్ల పట్టణంలోని బేతనీయ కాలనీలో గం టల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చీరాల, రేపల్లె పరిధిలోని పలు ఏరియాల్లో సైతం కరెంటు సరఫరాకు విఘాతం ఏర్పడింది.
- అమరావతి రాజధానిలోనూ వర్షం ప్రతాపం చూ పించింది. జోరుగా కురిసిన వర్షంతో నేల అంతా బురదమయంగా మారింది. దీంతో వేగవంతంగా జరుగుతోన్న నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. పనులు తిరిగి ప్రారంభం కావడానికి మూడు, నాలుగు రోజుల సమయం పడుతుందని స్థానికులు తెలిపారు. తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో రేకుల షెడ్డు కూలిపోయింది.
- గుంటూరు నగరంలో విద్యుత్‌శాఖకు రూ.10 లక్షల నష్టంగా అంచనా వేస్తున్నట్లు టౌన్-1 ఆపరేషన్ ఈఈ శ్రీని వాసబాబు తెలిపారు. రెండు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ (డీటీఆర్) దెబ్బతినటంతో పాటు విద్యుత్ పోల్స్ దెబ్బతిని నష్టం వాటిల్లిందన్నారు. చెట్లు ఎక్కడికక్కడ నేల కొరిగి విద్యుత్ తీగెలపై పడటంతో నగరంలో పలు ప్రాంతా ల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై రాకపోకలు కూడా స్తంభించిపోయాయి. గార్డెన్స్‌లోని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కార్యాలయం ఎదుటనే భారీ వృక్షం నేలకొరిగి విద్యుత్‌పోల్ పడిపోయి సరఫరా నిలిచిపోయింది. కాలువల్లోని మురుగు అంతా రోడ్ల పైకి చేరి దుర్గంధాన్ని వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మూడు గంటల్లో 42.87మి.మీ. వర్షపాతం

బాపట్ల జిల్లాలో మూడు గంటల్లో సగటున 42.87మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా అత్యధికంగా అత్యధికంగా యద్దనపూడి మం డలంలో 128 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా వేమూరులో 8.4 మిల్లీమీటర్ల వర్షం కురి సింది. పర్చూరు 81.4, చీరాల 79.8, ఇంకొల్లు 69.2, బాపట్ల 64.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. చెరుకుపల్లి 30.4, పిట్టలవానిపాలెం, కర్లపా లెం మండలాల్లో 38.6 మి.మీ. వర్షం కురిసింది.



బాపట్ల : బర్లీ పొగాకు బేళ్ల కిందకు చేరిన వర్షపు నీళ్లు

రైతులకు కొంత మేర నష్టం..

బాపట్ల, పల్నాడు ప్రాంతంలో కల్లాల్లోని మిర్చిపై రైతులు పరదాలు కప్పి జాగ్రత్తలు పాటించినా గాలివానకు నష్టపోయారు. కల్లాల్లో, ఇంటి ప్రాంగణాల్లో నిల్వ చేసిన నల్లబర్లి పొగాకు తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ ధాన్యం చాలా వరకు కోతలు పూర్తయి పంటను అటు కొనుగోలు కేంద్రాలకు తరలించడమో లేక నిల్వ చేసుకోవడమో చేయడంతో ధాన్యం రైతులపై ఈ అకాల వర్షం ప్రభావం పెద్దగా పడలేదు. అయితే సరైన ధర లేక విలవిలలాడుతున్న బర్లీ పొగాకు రైతులు అకాల వర్షం దెబ్బకు మరింత కుదేలయ్యారు. ఈదురుగాలులు ధాటికి వందల ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో దాదాపు 850 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. గాలివాన, వర్షంతో ఉద్యాన పంటల రైతులు విలవిల్లాడిపో యారు. సంగంజాగర్లమూడి, అంగలకుదురు వంటి పలు గ్రామాల్లో నిమ్మతోటల్లో పిందె దశలో ఉన్న కాయలు గాలి వేగానికి రాలి పోవ డంతో రైతులు ఆందోళన చెందారు. కొల్లిపర మండలంలో పలుచోట్ల అరటి తోటలు దెబ్బతిన్నాయి. గాలివాన పొన్నూరు చేబ్రోలు మండలాల్లో వాణిజ్య పంటల రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. పొన్నూరు ప్రాంతంలో గా లుల బీభత్సానికి అవిశె తోటలు విరిగిపడడం తో తమలపాకు పంట నేలమట్టమైంది. చేబ్రో లు మండలం నారాకోడూరు, వేజెండ్ల, శలపా డు ప్రాంతాల్లో తీగ జాతి కూరగాయ పంటలు పందిళ్లు నేలమట్టమయ్యాయి.

హత్య కేసులో ఏడుగురికి జీవితఖైదు

- సీసీఎల్ కోర్టుకు మరో ఇద్దరు మైనర్ల తరలింపు
- వాడరేవు ఘటనపై ఒంగోలు కోర్టు సంచలన తీర్పు

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి): కుమార్తెను ఇచ్చి పెళ్లి చేస్తామని నమ్మించి.. భోజనానికి ఇంటికి పిలిచి కిరాతకంగా హతమార్చిన ఏడుగురు నిందితులకు జీవితఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఏ.పూర్ణిమ శుక్రవారం సంచలన తీర్పు ఇచ్చారు. 2023 అక్టోబరులో చీరాల మండ లం వాడరేవులో చోటుచేసుకున్న కేసుకు సంబంధించి ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మోసా సూరిబాబు(30) అదే గ్రామానికి చెందిన పిక్కి సింహాద్రికి ఘటనకు రెండేళ్ల క్రితం రూ.3లక్షలు అప్పుగా ఇచ్చాడు. బాకీ చెల్లించకపోవడంతో ఇద్దరి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో సింహాద్రి భార్య శాం తితో సూరిబాబుకు వివాహేతర సంబంధం ఉన్నట్లు ప్రచారం జరిగిం ది. ఈ క్రమంలో సింహాద్రి, తన భార్య శాంతి, కుమార్తె, కుమారుడు (మైనర్‌లు) సహాయంతో సూరిబాబును అంతమొందించాలని పన్నాగం పన్నాడు. బంధువులైన వైజాగ్‌కు చెందిన బొంది డేవిడ్, గ్రామానికి చెందిన పిక్కి రాజు, పిక్కి ఆనంద్, పిక్కి సత్తెమ్మ, ఓరుపుల మాణిక్యం లను ఆశ్రయించాడు. పథకం ప్రకారం సూరిబాబుతో వీరు మాటలు కలిపి వారి కుమార్తెను ఇచ్చి పెళ్లి చేస్తామని నమ్మించారు. దీంతో అన్నీ మర్చిపోయిన సూరిబాబు 2023 అక్టోబరు 10న రాత్రి భోజనానికి సింహాద్రి ఇంటికి వెళ్లాడు. అయితే అప్పటికే ఇంట్లో నక్కిన ఐదుగురు, సింహాద్రి కుటుంబ సభ్యులు ఇనుప రాడ్లు, పైపులతో సూరిబాబుపై దాడి చేసి కిరాతకంగా హతమార్చారు. పొద్దుపోతున్నా తమ్ముడు ఇం టికి రాకపోవడంతో సూరిబాబు అక్క మోడిపిల్లి యల్లియమ్మ సింహాద్రి ఇంటికి వెళ్లి ఆరా తీసింది. అయితే వారు సమాధానం చెప్పలేదు. ఆమె అనుమానం పెరిగి స్థానికుల సహాయంతో సింహాద్రి ఇంటికి వెళ్లి బల వంతంగా తలుపులు తీయించి చూడగా రక్తపు మడుగులో పడిఉన్న సూరిబాబును చీరాల ఏరియా వైద్యశాలకు తరలించింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేయగా డీఎస్పీ ఎండీ మోయిన్, రూరల్ సీఐలు శేషగిరిరావు, మల్లికార్జునారావులు దర్యాప్తు చేశారు. పీపీ రామేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. కేసులో అప్పటి మైనర్లుగా ఉన్న సింహాద్రి కు మార్తె, కుమారుడుకు సీసీఎల్ కోర్టులో చార్జీషీటు వేయనున్నారు. కేసు లో కీలకంగా వ్యవహరించి శిక్షపడే విధంగా కృషి చేసిన అధికారులను, పోలీసు సిబ్బందిని ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారు.



బాపట్లలో మానవహారం

ప్రపంచానికి భారత్ సత్తా చాటిన సిందూర్

బాపట్ల తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా సైనిక బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ మన దేశ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. సైనికులను అభినందిస్తూ శుక్రవారం బాపట్లలో ఆపరేషన్ సిందూర్ విజ యోత్సవం పేరుతో తిరంగా ర్యాలీ జరిగింది. కొత్తబస్టాండ్ నుంచి నాయ కులు, అధికారులు, ప్రజలు జాతీయజెండాలతో భారతమాతకు జేజేలు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ దగ్గర, అంబేద్కర్ సర్కి ల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. యుద్ధంలో అమరులైన వారి ఫొటోలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతమాత ముద్దుబిడ్డలం ఆపద వస్తే ఐక్యంగా ఉద్యమి స్తామని ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి తెలియజేశామన్నారు. ఈ కా ర్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా, మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షు డు తాండ్ర సాంబశివరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాస రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతాజయప్రకాష్ నారాయణ, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, రేపల్లె జనసేన నాయకు లు మత్తి భాస్కరరావు, జిడుగు విజయమాధురి, హంస్సేన్‌బేగ్, బీజేపీ జి ల్లా అధ్యక్షుడు బంగారుబాబు, బ్రహ్మాండం బాలనారాయణ, బుర్లె రత్త య్య, టీడీపీ సీనియర్ నాయకులు మండపాటి ఆంధ్రేయ, జి.గిరిజారాణి, కాగిత నాగభూషణమ్మ, పల్లం సరోజని, దుర్గాప్రసాద్, మామిడి రమేష్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పోలీసులకు మూడు డ్రోన్లు వితరణ



ఎస్పీ తుషార్‌డూడీకి డ్రోన్లు అందజేస్తున్న దాతలు

దాతలను అభినందించిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులు సమ ర్థంగా విధులు నిర్వహించేందుకు డ్రోన్లు వినియోగించుకోవాలని దాతలు ఎస్పీ తుషార్‌డూ డీని కలిసి శుక్రవారం కలిసి మూడు డ్రోన్లను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఎస్పీ అభినందించారు. బల్లికురవ మండలానికి చెందిన సూర్యడెయిరీ ప్రొపెయిటర్ ఇప్పర్ల అంజిరెడ్డి, సం తమాగులూరు మండలానికి చెందిన గడివర్తి రా మకృష్ణ, బల్లికురవ, సంతమాగులూరు స్టేషన్లకు డ్రోన్లను అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్ర మంలో డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు శేషగిరి రావు, వెంకట్రావు, ఎస్ఐలు నాగరాజు, నాయిబ్‌ర సూల్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా ప్రారంభించాలి

- గుంటూరు చానల్‌కు నిధులు విడుదల
- భూసేకరణ, సర్వే త్వరితగతిన చేపట్టాలి
- జలవనరులశాఖ సమీక్షలో కేంద్ర మంత్రి పెమ్మసాని




సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు చానల్ విస్తరణ పనులను త్వరగా ప్రారంభించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్ర వారం గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి పెమ్మసాని ఇరిగేషన్ అధి కారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గుంటూరు, బాపట్ల ప్రాం తాలకు ఉపయోగపడేలా గుంటూరు చానల్ విస్తరణ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.400 కోట్లను నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భూసేకరణకు రూ.75 కోట్లు, విస్తరణకు రూ.96 కోట్లను నాలుగు విడతలుగా విడుదల చేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం ప్రకటించింది. కాగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో త్వరితగతిన విస్తరణ, భూసేకరణ పనులను ప్రారంభించాలని పెమ్మసాని అధికారు లకు స్పష్టం చేశారు. భూసేకరణని నాలుగు గ్రామాల్లో నిర్వహించాలని, సర్వే పనులను కాంట్రాక్టు సంస్థ చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వానికి అందించాల్సిన ప్రతిపాదనలు త్వరితగతిన పంపాలని, వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని అధికారులు పనుల చేయించాలన్నారు. సమావేశంలో ఇరి గేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ రాంబాబు, జలవనరుల శాఖ జిల్లా అధికారి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పార్కుతో ఉద్యోగాలు

చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

బల్లికురవ, మే 16 (ఆంధ్రజ్యోతి): సోలార్ పార్కు ఏర్పాటుతో యు వతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. సోలార్ పార్కు ఏర్పాటుపై శుక్రవారం మండలం లోని ఎస్ఎల్.గుడిపాడు, సంతమాగులూరు మండలం మామిళ్లపల్లి, కుందుర్రు గ్రామాలలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. గుడిపాడు గ్రామ పరిధిలో 310 ఎకరాలను సోలార్ పార్కుకు అందిస్తే త్వరలో పారిశ్రామికవాడగా అభివృద్ధి చెందుతుందన్నారు. కాలుష్యం సమస్యపై కొందరు రైతులు ప్రస్తావించగా ఏమీ ఉండదని, ఎవరికీ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సోలార్ పార్కు ఏర్పాటు చేస్తుందన్నారు. మామిళ్లపల్లి, కుందుర్రు గ్రా మాలలో 1,269 ఎకరాల భూములు ఈ ప్రాజెక్టు కోసం సేకరించాల్సి ఉందన్నారు. తహసీల్దార్లు రవినాయక్, రవిబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

భూముల రీ సర్వేలో మన విధానం భేష్

- తమ రాష్ట్రాల్లో అమలు చేస్తామన్న ప్రతినిధులు
- రెండు రోజుల జాతీయ కార్యశాల నిర్వహణతో గుంటూరుకు ఖ్యాతి
- కేంద్ర మంత్రి పెమ్మసాని, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వం

8

ఆర్టీసీలో.. కొరియర్ సేవలు సులభతరం

- త్వరలో ఆర్టీసీ ఇన్‌బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్
- కండక్టర్‌కి ఇస్తే.. పార్శిల్ కొరియర్

తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ప్రారంభం


ఎంపికైన లిఫ్టర్లతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

మంగళగిరి సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరుగనున్న జాతీయ సబ్ జూనియర్, జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా నుంచి 9 మంది పవర్ లిఫ్టర్లు ఎంపికయ్యారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. మహిళల సబ్ జూనియర్స్‌లో బి.లాలిత్య (76 కేజీలు), ఈఎల్ వినయశ్రీ (84 కేజీలు), పురుషుల సబ్ జూనియర్స్‌లో టి.శివకార్తీక్ (53 కేజీలు), ఎస్.మునీశ్వర్ రామ్ (83కేజీలు), మహిళల జూనియర్స్‌లో ఎం.షానూన్ (47కేజీలు), ఎల్.చాతుర్య (76 కేజీలు), ఎన్.జ్ఞానదివ్య (84+కేజీల విభాగం), పురుషుల జూనియర్స్‌లో ఎస్.కౌశిక్ (93 కేజీలు), డి.పృథ్వీ కుమార్ (105 కేజీలు) ఎంపికయ్యారని వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లిఫ్టర్లను ఏపీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ, సౌత్ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎస్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

మిర్చియార్డులో కలకలం

- అక్రమాలకు పాల్పడిన 18 మందిపై శాఖాపరమైన చర్యలు
- సస్పెన్షన్లు, సెన్సూర్, ఇంక్రిమెంట్ల కోత పెట్టే అవకాశం



గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో జరిగిన అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగం, ఎలక్షన్ కోడ్ ఉల్లంఘనలపై ఎట్టకేలకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ అందజేసిన నివేదిక ఆధారంగా 18 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా బాధ్యులైన ఉద్యోగులపై సస్పెన్షన్ చర్యలు కూడా త్వరలో చేపట్టే అవకాశం ఉన్నట్లు మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్ జీవో ఆర్‌టీ నంబరు. 275 జారీ చేశారు. ఈ ఉత్తర్వులు సాయంత్రానికి మిర్చియార్డుకు చేరుకోవడంతో ఉద్యోగవర్గాల్లో కలకలం రేకెత్తించింది. త్వరలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకొంటుందోనన్న ఆందోళన వారిలో నెలకొన్నది. కచ్చితంగా సస్పెన్షన్లు, సెన్సూర్‌లు, ఇంక్రిమెంట్ల కోత వంటి చర్యలుంటాయని అంచనా వేస్తున్నారు.

మిర్చియార్డులో వైసీపీ పాలనలో అటు ఆ పార్టీ నేతలు, ఇటు అధికారులు, ఉద్యోగులు అందినకాడికి దోచుకొన్నారు. అవినీతికి కాదేది అనర్హం అన్నట్లు యార్డులో అణువణువునా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ దోచేశారు. జీరో బిజినెస్, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలు, ఈనామ్‌లో మిర్చి టిక్కీల లెక్కల తారుమారు వంటి అక్రమాలకు పాల్పడ్డారు. అలానే లైసెన్సుల రెన్యువల్, భాగాస్వామ్య పేర్ల మార్పులు పెద్దఎత్తున చేశారు. కొత్త లైసెన్సులు నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారు. సెక్యూరిటీ డిపాజిట్లు మార్కెట్ కమిటీకి రాకుండా కోర్టులలో బలహీనంగా వాదనలు వినిపించారు. షాపుల సబ్‌లీజులు, చేతులు మారిన పర్మినెంట్ షాపుల పేర్ల మార్పులు వంటివి చేసి రూ. కోట్లు వెనకేసుకొన్నారు. దీనిపై మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏ ఎస్ రామకృష్ణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ విచారణ గత ఏడాది ఆఖరులో జరిగింది. ఆ శాఖ అధికారులు విచారణ జరిపి రూ. 347 కోట్ల అవినీతి జరిగిందని నివేదిక సమర్పించగా దానిని యథాతథంగా విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ ప్రభుత్వానికి పంపి చర్యలకు సిఫార్సు చేశారు. మిర్చియార్డు గత ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డితో పాటు గ్రేడ్-2 సెక్రెటరీ కే శివారెడ్డి, అసిస్టెంట్ సెక్రెటరీలు వీ ఆనందభాస్కర్, కే జయరామిరెడ్డి, సూపర్‌వైజర్లు కే సాంబిరెడ్డి, షేక్ అబ్దుల్ కరీం, సీహెచ్ శివారెడ్డి, కే వెంటక దుర్గా శివనాగరాజు, జీ మురళీకృష్ణ, షేక్ ముస్తఫా, ఎం శ్రీనివాసరావు, జీ యలమంద, ఎం రమేష్‌బాబు, సీహెచ్ పెద్దారావు, ఎం వీ రాఘవరావు, జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్లు షేక్ ఖాజా, టీ శేషుబాబు, డ్రైవర్ కే శ్రీనివాసరావులపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసింది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించి వైసీపీకి అనుకూలంగా వీరిలో ఒకరిద్దరు ప్రచారం కూడా చేశారు. దాంతో దానిపైనా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. విజిలెన్స్ విచారణలో భాగంగా మిర్చియార్డులో చైర్మన్లుగా బాధ్యతలు నిర్వహించిన వైసీపీ నేతలను కూడా విచారించింది. అయితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.


రాజధాని రైతులను కలిసి అభిప్రాయాలు తీసుకుంటున్న టీఐఎస్ఎస్ విద్యార్థులు

స్వచ్ఛందంగానే రాజధానికి భూములిచ్చాం

- టీఐఎస్ఎస్ విద్యార్థుల సర్వేలో రైతుల వెల్లడి

తుళ్లూరు,మే 16,(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛందంగా రాజధాని అమరావతికి భూములిచ్చామని రైతులు స్పష్టం చేస్తున్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టీఐఎస్ఎస్)కి చెందిన లా సోషల్ పాలసీ, ఎంఏ ఇన్ పబ్లిక్ పాలసీ విద్యార్థులు అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌పై ప్రాజెక్ట్ వర్క్ చేశారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారా? ఇచ్చిన తర్వాత వారి జీవన, వ్యవహార శైలీ, వ్యవసాయ కూలీల పరిస్థితి, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్య, వైద్య సదుపాయాలు తదితర అంశాలు, అందుకు ప్రభుత్వ చర్యలను పరిశీలించారు. శుక్రవారం నుంచి రాజధాని 29 గ్రామాలలో బృందాలుగా విద్యార్థులు సర్వే చేశారు. ఈ సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి, వరల్డ్ బ్యాంకుకు అందజేయనున్నారు. స్వచ్ఛందంగానే భూములు ఇచ్చామని, చిన్న చిన్న సమస్యలున్నా.. వాటిని సీఆర్డీఏ పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటోందని సర్వే టీం సభ్యులకు రైతులు స్పష్టం చేశారు. రాజధాని ప్రకటన ముందు నుంచే.. ఇక్కడే నివాసాలున్న వారిని గుర్తించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వైద్యశాలల్లో ఓపీ నుండి ఆపరేషన్ దాక ఉచిత వైద్యం అందజేయాలని కొందరు రైతులు కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమరావతి హెల్త్ కార్డులు ఇచ్చారని వైసీపీ ప్రభుత్వంలో అవి సరిగా పని చేయలేద చెప్పారు. అమరావతి అభివృద్ధి పనులు వేగవంతంగా చేసి రైతుల ప్లాట్లకు విలువ పెంచాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతికి అదనంగా 45 వేల ఎకరాలు ప్రభుత్వం తీసుకోవాలనే దాని మీద సర్వే సభ్యులు వివరణ కోరగా.. అమరావతి నగరం 217 చదరపు కిలోమీటర్లు పరిధి అభివృద్ధి చేస్తే, పక్కన ఉన్న రైతులు తమ లాగే స్వచ్ఛందంగా ల్యాండు పూలింగ్‌కి భూములు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీఐఎస్ఎస్ సర్వే విద్యార్థులకు వీఐటీలో వసతి సౌకర్య కల్పించారు.

కబలించిన లారీ..!

- స్కూటీని ఢీకొట్టడంతో తల్లి మృతి, కూతురికి గాయాలు
- న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి బంధువుల ఆందోళన

కొల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా.. కుమార్తె తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. అమృతలూరు మండలం మూల్పూరుకు చెందిన ఇంటూరి రూప (36) తమ కుమార్తె సుభాషిణితో కలిసి పుట్టినిల్లు దోనేపూడి శివారు గ్రామం ఆలపాటి నగర్‌లో బంధువుల వివాహ వేడుకకు గురువారం వచ్చారు. ఉదయం తిరిగి తన స్కూటీపై వెళ్తుండగా.. మండల పరిధిలోని మొసలిపాడు చెరువు వద్ద కొల్లూరు నుంచి వస్తున్న టిప్పర్ లారీ వెనుక నుంచి వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటి వెనుక కూర్చున్న రూప రోడ్డుపై పడిపోవడంతో లారీ ఆమె పైనుంచి వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటి నడుపుతున్న కుమార్తె సుభాషిణి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రురాలిని 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో స్కూటి పూర్తిగా దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ అర్జున్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కుమార్తె మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, భర్త యిర్మియా, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని, రోడ్డుపై బైఠాయించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. వేమూరు ఎస్ఐ శివకృష్ణ, సిబ్బంది వారితో చర్చించారు. వారిని స్టేషన్‌కు తీసుకు వెళ్లగా రాత్రి 7 గంటల వరకు చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. మృతదేహం ఘటనా స్థలంలోనే ఉండిపోయింది. దీంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకున్నారు.


రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతురాలు బంధువులు

జ్యోతిర్మయికి నీట్ పీజీలో ఆలిండియా 47వ ర్యాంక్



బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణానికి చెందిన పీటా జ్యోతిర్మయి నీట్ పీజీ ఎండీఎస్ ప్రవేశ పరీక్షలో ఆలిండియా 47వ ర్యాంక్ సాధించింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన జ్యోతిర్మయి ఇంటర్మీడియెట్‌లో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్‌లో బి.డి.ఎస్ పూర్తి చేసింది. తల్లిదండ్రులు శ్రీనివాస్, విజయలక్ష్మి కుమార్తెకు ర్యాంక్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

'గోపాలమిత్ర' వ్యవస్థ పరిశీలనకు కమిటీ

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలోని గోపాలమిత్ర వ్యవస్థ పనితీరును పరిశీలించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఏపీ లైవ్‌స్టాక్ ఏజెన్సీ సీఈవో అధ్యక్షతన పశుసంవర్ధక, పశు వైద్య నిపుణులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019కు ముందున్న విధంగా గోపాలమిత్ర వ్యవస్థను కొనసాగించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, గ్రామ పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రల మధ్య జాబ్‌చార్ట్‌పై స్పష్టమైన హద్దును కమిటీ సూచించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సైన్యానికి ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలి

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టి వీరోచితంగా పోరాడుతున్న సైనికులకు ప్రజలంతా అండగా నిలవాలని రైల్వే గుంటూరు సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయం నుంచి ఆపరేషన్ సింధూర్ - సాలిడారిటీ ర్యాలీని రైల్వేస్టేషన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డీసీఎం మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం ఆపరేషన్ సింధూర్‌ని ప్రారంభించిందన్నారు. ఉగ్రవాదుల పీచమణిచి బాధిత కుటుంబాలకు న్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ ఎం రవికిరణ్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, ఏఎస్‌సీ శైలేష్‌కుమార్ పాల్గొన్నారు.

పది జిల్లాల్లో డీసీహెచ్‌లు మార్పు

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పనితీరు సరిగా లేదనే కారణంతో వైద్య ఆరోగ్య శాఖ పది జిల్లాలకు కొత్త జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీసీహెచ్)లను నియమించింది. అల్లూరి సీతారామరాజు, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో డీసీహెచ్‌లను మార్చింది. గత మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించి, ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే పది జిల్లాల అధికారులను మార్చారు.

యడ్లపాడులో దొంగల హల్‌చల్

నగదు, వెండి, బంగారు ఆభరణాల చోరీ

యడ్లపాడు, మే 16 (ఆంధ్రజోతి): మండల కేంద్రంలో గత అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఖాళీగా ఉన్న రెండు గృహాల్లో చోరీకి యత్నించారు. గ్రామానికి చెందిన కారు డ్రైవర్ నరవర్య హనుమాన్‌సింగ్ గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లి అర్ధరాత్రి 2 గంటల ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి తలుపు తాళం పగుల గొట్టి ఉండడాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా చిందరవందరగా వస్తువు పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించాడు. అతని కుటుంబ సభ్యులంతా మూడు రోజుల క్రితం మహబూబ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు బీరువాలో దాచి ఉంచిన నగదు రూ.20 వేల నగదు, సుమారు 500 గ్రాముల వెండి ఆభరణాలు, ప్రతిమలు, 8 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే హనుమాన్‌సింగ్ ఇంటి ఎదురుగా ఉన్న దండా ప్రమీల నివాసంలో కూడా చోరీయత్నం చేశారు. తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి దొంగలు విలువైన వస్తువులు లేకపోవడంతో పాటు.. వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఒంటరిగా ఉంటున్న ప్రమీల ఇటీవల మోకాలు ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లినట్లు సమీప బంధువులు తెలిపరు. ఎస్ఐ శివరామకృష్ణ ఘటనా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. రెండు ఇళ్లల్లో ఒకే విధంగా తాళాలు పగులగొట్టిన విధానం చూసి, ప్రొఫెషనల్ దుండగుల పని అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. గ్రామంలో ఇటీవల దొంగతనాలు పెరుగుతుండడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తెనాలి రూరల్, మే16 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ వెంకటాద్రి వివరాల ప్రకారం.. పట్టణంలోని మల్లెపాడు రైల్వే గేటు సమీపంలో రైల్వే ట్రాక్‌పై సుమారు 35 నుండి 40 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు కింద మృతి చెందాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడిని గుర్తిస్తే రైల్వే పోలీస్ ఫోను నంబరు 72070 76614 సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

చేపల చెరువులో పడి వ్యవసాయ కూలీ మృతి


ఏడుకొండలు (ఫైల్ ఫొటో)

నూజెండ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కూలీ ప్రమాదవశాత్తు చేపల చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలోని వీ అప్పాపురం గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం శరగానివారిపాలేనికి చెందిన సీహెచ్ ఏడుకొండలు(55) వ్యవసాయ పనులకు వెళ్తూ..చేపలు పడుతుంటాడు. నూజెండ్ల మండలంలోని వీ అప్పాపురం గ్రామంలో చేపలు పట్టేందుకు ముఠాలో కూలీగా వచ్చి ప్రమాదానికి గురయ్యాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బీవీ కృష్ణారావు పరిశీలించారు. శుక్రవారం మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


వజ్రగిరి కోటమ్మ(ఫైల్ ఫొటో)

నూజెండ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మృత్యుంజాపురం గ్రామానికి చెందిన వజ్రగిరి కొండమ్మ(45) ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం గుట్లపల్లి జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. పుల్లల చెరువు మండలం తోటపాచర్లలో బంధువుల ఇంటికి వెళ్లి వస్తున్న సందర్భంలో ఆమె ప్రయాణిస్తున్న కారు కట్టెల ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొదముల కుమారి, షారోన్, ప్రశాంత్ రాజుకు గాయాలయ్యాయి.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



పొన్నూరుటౌన్, మే 16: పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బస్ సెల్టర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి పట్టణంలోని గుంటూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న సెల్టర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి.. పోలీసులకు సమాచరం అందించారు. అక్కడికి చేరుకున్న అర్బన్ పోలీసులు వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి తిరిగి వెళ్లడానికి బస్‌షెల్టర్ వేచి ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పంచానామా నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యవసాయంలో సాంకేతికను వినియోగించాలి

- వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ)మే 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికను రైతులు సద్వినియోగించుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. లాంఫాంలోని ఆచార్య వర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన అటారి జోన్ టెన్ యాన్యువల్ వర్క్‌షాప్, యాక్షన్ ప్లాన్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరగాలన్నారు. ఏఐ ఆధారిత ఫెర్టిగేషన్, ఇరిగేషన్, అంతర కృషి సాగు చేపట్టాలని సూచించారు. బయోస్టిమ్యూలెంట్స్, హార్మోన్స్ వినియోగం, అగ్రి-హార్టి-టూరిజమ్, టమోటలు, వంకాయ మొక్కల వినియోగం పెరగాలన్నారు. పెరుగుతున్న జనాభిని అంచనావేస్తే తగిన ఆహార పంటలను పండిస్తు ప్రణాళికలు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అటారి డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎన్ మీరా, ఏపీఎస్ఎస్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ సతీష్, ఉద్యాన, పశుసంవర్ధక విశ్వవిద్యాలయ అధికారులు, విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, డాక్టర్ గోవిందరాజు, డాక్టర్ శోభామణి, కేవీకే, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


భవనం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ఎం.వెంకటరామకృష్ణ తేజ

భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

- పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎం.వెంకటరామకృష్ణ

గుంటూరు సిటీ, మే16(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనాల త్వరితగతిన పూర్తిచేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.వెంకట రామకృష్ణ తేజ ఆదేశించారు. శుక్రవారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం భవనాన్ని ఆయన గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినాతో కలిసి పరిశీలించారు. జరుగుతున్న పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన డీఎల్‌డీఓ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బస్సు, ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ, ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, డీఈ శివరామకృష్ణ, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీడబ్ల్యూఎంఏ పీడీ శంకర్, డీపీఓ సాయికుమార్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

బాపట్ల వార్తలు


బాధిత రైతుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

రైతుకు నష్టపరిహారం చెక్కు అందజేత

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆసోదివారిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని బసివిరెడ్డిపాలేనికి చెందిన కోకి యలమందారెడ్డి గేదె పిడుగుపాటుకు మృతి చెందింది. దీంతో ప్రభుత్వం నుంచి నష్టపరిహారంగా రూ.50 వేలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ బాధిత రైతుకు మంజూరైన చెక్కును శుక్రవారం అందజేశారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పని చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్

బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తానని ఆయన హామీనిచ్చారు. చెరువుజమ్ములపాలెం గ్రామానికి చెందిన నాయకులు, రైతులు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అదేవిధంగా బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలకు చెందిన పలువురు తమ సమస్యలను అర్జీల ద్వారా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పురావస్తు శాఖ రీజనల్ డైరెక్టర్ ఎస్‌కే పాఠక్‌ను సన్మానిస్తున్న శ్రీభావన్నారాయణ స్వామి దేవాలయ పండితులు, కమిటీ సభ్యులు

భావదేవుని ఆలయాన్ని పట్టించుకోండి

● పురావస్తు శాఖ రీజనల్ డైరెక్టర్‌కు పండితులు, భక్తుల వినతి

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలోనే ఘనమైన చరిత్ర కలిగిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి దేవాలయాన్ని పట్టించుకోవాలంటూ ఆలయ పండితులు, భక్తులు శుక్రవారం బాపట్ల ఆలయానికి విచ్చేసిన దక్షిణ భారత పురావస్తుశాఖ రీజనల్ డైరెక్టర్ ఎస్‌కె పాఠక్‌ను కోరారు. పురావస్తుశాఖ పరిధిలోని ఈ ఆలయంపై వెంటనే స్పందించి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా తగువిధంగా అభివృద్ధి చేయాలని కోరారు. పలువురు భక్తులు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాలను ఆయనకు అందజేశారు. పురావస్తుశాఖ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పాఠక్ వివరించారు. ఆలయ చరిత్రను పలువురు ఆయనకు వివరించారు. భావదేవునిపై ఎంతో నమ్మకంతో ఆలయ ప్రాంగణంలో గతంలో వివాహాలు జరుపుకునే సంప్రదాయం ఉండేదని గాలిగోపురం కూలిపోయిన తర్వాత ఇక్కడ వివాహాలు చేసుకునేవారికి అనుమతులు నిలిపివేశారన్నారు. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ ఆచారాన్ని పునరుద్ధరించాలని కోరారు. గాలిగోపురం కూలిపోయిన సమయంలో దానికి అనుబంధంగా ఉన్న గంటను తొలిగించారు. తిరిగి దానిని పునరుద్ధరించే అంశాన్ని పట్టించుకోలేదు. ఇప్పుడున్న యాగశాల వద్దే శాశ్వతమైన యాగశాల ఏర్పాటు చేయాలని విన్నవించారు. రథశాలలోకి వెళ్ళేందుకు మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై స్పందించిన పాఠక్ మాట్లాడుతూ ఇక్కడ భక్తులు విన్నవించిన విధంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి అవసరమైన అన్ని చర్యలు సమర్థవంతంగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పురావస్తుశాఖ పరిధిలో ఘనమైన చరిత్ర కలిగిన ఆలయాల పరిరక్షణ కోసం, వాటిలోని అవసరాలను మెరుగుపరిచి చేపట్టాల్సిన చర్యలపై సమీక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమా, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు, విశ్రాంత మున్సిపల్ కమిషనర్ శ్రీరామశర్మ, కొటికం సుబ్బారావు గురుస్వామి, ఆలయ ధర్మకర్త దేశిరాజు వెంకటరమణబాబు, ఆలయ అర్చకులు నల్లూరి పాంచజన్య తదితరులు పాల్గొన్నారు.


నందిరాజుతోటలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న బాపట్ల డీఎల్‌పీవో కుమారస్వామి

వర్మీ కంపోస్ట్ అమ్మకంతో ఆదాయం పెంచాలి

● బాపట్ల డీఎల్‌పీవో కుమారస్వామి

బాపట్లరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని ప్రతి కుటుంబం నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్ట్, డ్రైవేస్ట్ అమ్మకాల ద్వారా పంచాయతీకి ఆదాయ వనరులు పెంచుకోవాలని బాపట్ల డివిజనల్ పంచాయతీ అధికారి కుమారస్వామి అన్నారు. ఈస్ట్ బాపట్ల పంచాయతీ నందిరాజుతోటలో గల ఎస్‌డబ్ల్యు పీసీషెడ్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. గ్రామంలో రోడ్లపైన, బహిరంగ ప్రదేశాలలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచటం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, షెడ్‌మిత్ర కందుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రాజారావు

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ గుదే రాజారావును ప్రకటించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం బహుజన సంకల్పసభ నిర్వహించారు. సభకు రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌత్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతన కమిటీలు నియమించే క్రమంలో రాజారావును జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఇన్‌చార్జిలు తమ్ములూరి వెంకయ్య, చిట్టిమళ్ళ సంగీతరావు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు డొక్కా శ్రీనుబాబు, మందా జోసఫ్, గడ్డం ఏలియా, పాలపర్తి సంతమ్మ, నల్లమోతు శామ్యూల్ జాన్సన్, జోసఫ్, కొప్పూరి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమ శాఖలో పోస్టులు

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలోని బాలల పరిరక్షణ విభాగంలో ఒప్పంద పద్ధతిలో ఔట్ రీచ్ వర్కర్ పోస్ట్ (పురుషులు), ప్రత్యేక దత్తత సంస్థలో వైద్యురాలు, ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. అదేవిధంగా సఖీవన్‌స్టాప్ సెంటర్‌లో కేసు వర్కర్-1, పారామెడికల్ సిబ్బంది-1, మల్టీపర్పస్ సిబ్బంది-1 (మహిళలు) పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్బర్‌పేటలోని బాలసదన్‌లో ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

తిరంగా ర్యాలీకి తరలి వెళ్ళిన మండల టీడీపీ నాయకులు

పిట్టలవానిపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : భారత్ జవాన్‌లకు మద్దతుగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పిలుపుమేరకు ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీకి పిట్టలవానిపాలెం మండలం నుంచి కూటమి నాయకులు శుక్రవారం అధిక సంఖ్యలో బాపట్ల తరలి వెళ్ళారు. అక్కడ జరిగిన తిరంగా ర్యాలీలో పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు ఎం.శంకరరెడ్డి, కె.సాంబమూర్తిరాజు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పి.సాయిబాబారెడ్డి, గోకరాజు నరసరాజు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖాసీం పాల్గొన్నారు.

పిల్లర్స్‌కే పరిమితమైన అగ్నిమాపక భవనం

● గత ఐదేళ్ళలో అభివృద్ధి చేయని వైసీపీ ప్రభుత్వం


పిల్లర్స్ వద్దే నిలిచిపోయిన అగ్నిమాపక భవన కేంద్రం

రేపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలోని రేపల్లె పట్టణంలో అగ్నిమాపక కేంద్ర భవనానికి నిధులు మంజూరు చేసిన గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఇటుక కూడా పేర్చిన దాఖలాలు లేవు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక కేంద్రం నూతన భవనానికి రూ.40 లక్షలు నిధులు మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. రూ.7 లక్షలతో బేస్‌మెంట్ లెవెల్ పిల్లర్స్ పనులు చేశారు. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం 2024 వరకు అగ్నిమాపక కేంద్రం భవనం అభివృద్ధి పనులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అగ్నిమాపక కేంద్రం పాతభవనంలో ఉన్నా ఫైర్ ఇంజన్లు పెట్టుకునే షెడ్లు, పూర్తి స్థాయిలో కార్యాలయం లేదు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాలకు ఇది ఒక్కటే అగ్నిమాపక కేంద్రంగా ఉంది. ఎటుచూసినా 25 నుంచి 35 కిలోమీటర్ల దూరం ప్రమాదాలు సంభవించినపుడు అగ్నిమాపక శకటం వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఒక్కటే అగ్నిమాపక శకటం ఉండటంతో రెండుచోట్ల అగ్నిమాపక ప్రమాదాలు జరిగితే ఒక్కచోట పూర్తిగా కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రెండవ అగ్నిమాపక శకటం కోసం ప్రయత్నాలు చేశారు. కానీ ఇప్పటికి ఒక్క అగ్నిమాపక వాహనంతోనే కాలం వెల్లతీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టిసారించి నూతన భవన అభివృద్ధి పనులు ప్రారంభించి రెండవ అగ్నిమాపక శకటాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో భారీ వర్షం

● యద్దనపూడిలో అత్యధికం, వేమూరులో స్వల్పం

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కారణంగా పలుచోట్ల చెట్లు నేలకు ఒరిగాయి. అనేక చోట్ల ఖాళీ స్థలాలలో నీరు నిలిచింది. రైతులు ఖరీఫ్‌కు పొలాలు సిద్ధం చేసుకునేందుకు దుక్కికి అనుకూలంగా వర్షం ఉపయోగపడుతుందని పలువురు పేర్కొంటున్నారు. మెట్ట పొలాలలో సాగు చేస్తున్న కొన్ని పంటలకు వర్షం వల్ల నష్టం జరుగుతుంది. మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. యద్దనపూడి మండలంలో అత్యధికంగా 128 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా వేమూరులో 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చుండూరులో 23.2, అమర్తలూరులో 15.6, కొల్లూరులో 12.8, భట్టిప్రోలులో 14.6, చెరుకుపల్లిలో 30.4, పిట్టలవానిపాలెంలో 38.6, కర్లపాలెంలో 38.6, బాపట్లలో 64.8, నిజాంపట్నంలో 36.4, నగరంలో 33.6, రేపల్లెలో 50.8, సంతమాగులూరులో 10.8, బల్లికురవలో 20.2, మార్టూరులో 52.2, పర్చూరులో 81.4, కారంచేడులో 57.4, ఇంకొల్లులో 69.2, జెపంగులూరులో 43, అద్దంకిలో 47.7, కొరిశపాడులో 43.5, చీరాలలో 79.8, వేటపాలెంలో 35.2, చినగంజాంలో 35.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


భారీ వర్షంతో ఇళ్ళ మధ్య ఖాళీ స్థలాలలో నిలిచిన నీరు

తీరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం

రేపల్లె, మే 16(ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన వర్షం గురువారం అర్ధరాత్రి నుంచి పడటంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. చెట్టుకొమ్మలు విరిగి నేలకు ఒరిగాయి. నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామంలో భ్రమరాంబసమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం ఈదురుగాలులతో కూడిన వర్షం తాకిడికి విరిగిపడిపోయింది. అదే విధంగా నగరం, నిజాంపట్నం మండలాల్లోని మామిడితోటల్లో మామిడికాయలు నేలవాలి మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన పంట నేలపాలు అవ్వటంతో మామిడి రైతులు బోరున విలపిస్తున్నారు. పలుప్రాంతాల్లో విద్యుత్‌స్తంభాలు నేలవాలాయి. దీంతో అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పిడుగుపాటుకు దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు

● ఈదురు గాలులకు పడిపోయిన విద్యుత్ స్తంభాలు

వేమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ సందర్భంలో వేమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పిడుగుపాటు సంభవించింది. దీని వల్ల సబ్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. కొన్ని మీటర్లు కూడా కాలిపోయాయి. ఈదురు గాలులకు వరహాపురం, పెరవలిపాలెం, పెరవలి, చదలవాడ గ్రామాల పరిధిలో కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అనేక చోట్ల పెద్ద చెట్లు పడిపోయాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో మెయిన్ లైన్ వైర్లు తెగిపోయాయి. దీంతో గ్రామాల్లో విద్యుత్ అంతరాయం తీవ్రంగా ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, స్తంభాలు పడిపోవడం వల్ల లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు ఏఈ గోపి తెలిపారు. గుంటూరు ట్రాన్స్ కో విభాగానికి చెందిన సిబ్బంది ద్వారా తక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

కొల్లూరులో నేలవాలిన అరటి, రాలిన మామిడి, సపోటా

● విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం


కొల్లూరులో గాలివానకు నేలవాలిన చెట్లు

భట్టిప్రోలు, కొల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. గురువారం అర్ధరాత్రి బలమైన గాలులతో కూడిన వర్షం కురవడంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో చాలా చోట్ల అరటి తోటల్లో చెట్లు విరిగి పడగా, మామిడి, సపోటా తోటల్లో కాయలు పూర్తిగా రాలిపోయాయి. భారీగా వీచిన గాలుల వల్ల చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామాల్లో గాడాంధకారం అలముకుంది. కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో తుది దశకు వచ్చిన ఇటుక ఉత్పత్తిదారులు తీవ్రంగా నష్టపోయారు. కల్లాల్లో తీసిన పచ్చి ఇటుక అకాల వర్షానికి తడిసి ముద్దయింది. గురువారం అర్ధరాత్రి 2 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు వర్షం ఓ మోస్తరుగా కురుస్తుండటంతో రహదారులు జలమయమయ్యాయి. కల్లాల్లో ఉన్న మొక్కజొన్న పంట ఉత్పత్తులు కూడా వర్షం బారిన పడి తడిసిపోయాయి.

వర్షం ఉన్నా లేకపోయినా... విద్యుత్ సరఫరాలో అంతరాయం

వర్షం, గాలులు ఉన్నా లేకపోయినా విద్యుత్ సరఫరాలో మాత్రం రోజు వినియోగదారులు అంతరాయాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో నిర్వహణ సరిగా లేకపోవడంతో ఆ ప్రభావం ఇప్పుడు తీవ్ర సమస్యగా మారింది. కొద్దిపాటి గాలులు వీచినా విద్యుత్ అంతరాయాలు సర్వ సాధారణం అయిపోయాయి. వాతావరణం సాధారణ స్థితి చేరుకున్నా విద్యుత్ పునరుద్ధరించడంలో అధికారులు, సిబ్బంది అపసోపాలు పడాల్సి వస్తుంది. గురువారం మధ్యాహ్నం కొద్దిపాటి గాలులు వీయడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రం కొల్లూరులో సాయంత్రం 4.30 గంటల సమయంలో విద్యుత్ పునరుద్ధరించినప్పటికీ లంక గ్రామాల్లో మాత్రం విద్యుత్ పునరుద్ధరణ జరగలేదు. ఈపూరులంక సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 2.45 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరా అందించారు. అర్ధరాత్రి 2 గంటలకు బలమైన గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం చోటు చేసుకోగా శుక్రవారం 11 గంటలకు విద్యుత్ సరఫరాను ఆ శాఖ సిబ్బంది పునరుద్ధరించారు.


వేమూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పిడుగుపాటుకు దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్

దోమకాటు ఆరోగ్యానికి చేటు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ అన్నారు. డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో జెండాఊపి ర్యాలీ ప్రారంభించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దోమల నియంత్రణకు వ్యక్తిగత జాగ్రత్తలతోపాటు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. జిల్లాలో డెంగీ మరణాలు లేవన్నారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ శాఖ, ఆరోగ్య శాఖ పరస్పర అవగాహనతో కార్యక్రమాలు చేపట్టి దోమలు నిర్మూలన చేసి డెంగీ, మలేరియా, బోధకాలు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడతామన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, కండరాలు, కీళ్ళనొప్పులు, ఎర్రటిదద్దుర్లు, తలనొప్పి లాంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించి పరీక్ష చేయించుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే సమర్థవంతంగా జరుపుతున్నామన్నారు. అనంతరం మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సమన్వయకర్త డాక్టర్ మోజెష్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, జిల్లా మలేరియా కార్యాలయ సబ్ యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, పట్టణ సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కూచినపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో

రేపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి) : దోమకాటు మానవాళి ఆరోగ్యానికి చేటు అని డాక్టర్ నాగార్జున అన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమల నిర్మూలన చేసి డెంగీ, మలేరియా, బోధకాల వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. తీవ్రమైన జ్వరం, కండరాలు, కీళ్ళ నొప్పులు, ఎర్రటి దద్దుర్లు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళి వైద్యులను సంప్రదించాలని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడా గుంతల్లో మురుగునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారులు మురళి, సాంబశివరావు, లక్ష్మీ, మాధవి, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కూచినపూడిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

కర్లపాలెంలో...

కర్లపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్యులు, వైద్యసిబ్బంది జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా, ఆరోగ్య, హాస్పిటల్ సిబ్బంది కర్లపాలెం ప్రభుత్వ వైద్యశాల నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుహానబేగం, సూపర్‌వైజర్ ఇస్సార్, పీహెచ్‌ఎస్ ప్రభావతి, హెచ్‌వీ ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కర్లపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, ఏఎన్‌ఎంలు తదితరులు


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

సమస్యల పరిష్కారానికే ప్రజాఫిర్యాదుల కార్యక్రమం

● మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసమే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమానికి 48 ఫిర్యాదులు అందాయి. ఆయన మాట్లాడుతూ వచ్చిన అర్జీల్లో 30 భూమికి సంబంధించిన సమస్యలు వచ్చాయన్నారు. వాటిల్లో కొన్ని పాస్‌బుక్‌లు, అడంగల్స్, 1బి పేరు నమోదు తదితర సమస్యలపై అర్జీలు దాఖలు చేసుకున్నారన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్‌లకు, నివేశనస్థలాలకు కొన్ని దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పట్టణంలో, గ్రామాల్లో రహదారులు, తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు అందాయని, వచ్చిన ఫిర్యాదులు ఆయా శాఖల అధికారులకు అందించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, కొలసానిరాము, బొర్రా సూర్యరాజు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, పొన్నూరి గౌరీరామకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్ సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 18వ వార్డు ఎన్టీఆర్‌నగర్ కాలనీ వాసులకు తాగునీరు లేక నానా ఇబ్బందులకు గురౌవుతున్నారని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ అన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లో తాగునీరు రావటం లేదని ఖాళీబిందెలతో వార్డు ప్రజలు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో వెయ్యిమంది పైనే జనాభా ఉన్నారని, మున్సిపల్ అధికారులు మాత్రం తాగునీరు అందించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి.దనమ్మ, సి.నాంచారమ్మ, డి.పిచ్చియ్య, కె.వీరాంజనేయులు, ఎ.నాగలక్ష్మి పాల్గొన్నారు.


తాగునీరు అందించాలని బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

చెరుకుపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో ఈనెల 16వ తేదీ నుంచి 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము అందజేయబడతాయని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావలసిన వారు పొలం పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ తీసుకుని వీఏఏని సంప్రదించాలన్నారు. అలాగే శుక్రవారం కనగాల, ఆళ్ళవారిపాలెం గ్రామాలలో కౌలు రైతు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వీఏఏలు, వీఆర్ఏలు రైతులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి నింబు ఫల పూజ

వేమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారికి విశేషంగా నింబు ఫల పూజ నిర్వహించారు. మొవ్వా మల్లికార్జునరావు దంపతులు ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం జరిపించి సాయంత్రం విశేషంగా అష్టోత్తర సహస్ర నామ పూజ, పల్లకి ఉత్సవం జరిపించారు. భజన సమాజాల వారు హనుమాన్ చాలీసా పారాయణ, భజన కీర్తనలు ఆలపించారు.


నింబు ఫల పూజలో వీరాంజనేయస్వామి

ఘనంగా శ్రీ పోలేరమ్మ తిరునాళ్ళ

కర్లపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామంలో ఉన్న శ్రీ పోలేరమ్మ తిరునాళ్ళ మహోత్సవంలో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారికి చద్ది నైవేద్యాలు, మల్లెపూల సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అక్కల రమణారెడ్డి, కుంచాల సూర్యనారాయణరెడ్డి, పెద్ద నాగిరెడ్డి, కావూరి ముసలారెడ్డి, మురళిరెడ్డి, రావి నరసారెడ్డి, కుంచాల అయ్యప్పరెడ్డి, అక్కల గోపిరెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన

వేమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మసీదు నిర్మాణానికి శుక్రవారం ముస్లిం మత పెద్దలతో కలిసి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని మతాలను గౌరవించే ఏకైక పార్టీ వైసీపీ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ బుజ్జి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు షేక్ బాజీ, మత పెద్దలు, వైసీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచి సేవా దృక్పథం పెరగాలి : రజనీ

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : చిన్నప్పటి నుంచి ప్రతి ఒక్కరు సేవాదృక్పధంతో పెరగాలని సనాతనధర్మ సభ్యురాలు బండ్రెడ్డి రజనీ తెలిపారు. మండలంలోని నందిరాజుతోట గ్రామం ఎస్టీకాలనీలోని మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో శుక్రవారం బండ్రెడ్డి రజనీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి కాలనీ ప్రజలకు సనాతనధర్మ విలువలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు దేవుళ్ళ పటాలు, నిత్యావసర వస్తువులైన సబ్బులు, పేస్ట్‌లు, కొబ్బరి నూనె, పౌడర్‌లు పంపిణీ చేశారు. సనాతనధర్మ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో

కర్లపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఉచిత చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం మండలం పేరలి సచివాలయం వద్ద చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, కార్యదర్శి వీరాస్వామిరెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

కొల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొల్లూరుకు చెందిన తల్లపనేని పవన్‌కుమార్ (44) మద్యానికి బానిసై మద్యం మత్తులో అప్పుడప్పుడు వింతగా ప్రవర్తిస్తుంటాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో పురుగు మందును తాగడం గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అర్జున్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



లక్ష్యం నెరవేరని.. మత్స్యకేంద్రం!

● విజయపురిసౌత్‌లో నామమాత్రంగా చేప పిల్లల ఉత్పత్తి

● జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులు

మాచర్ల టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): మత్స్య సంపదను అభివృద్ధి చేసి, మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ప్రభుత్వ లక్ష్యం నాగార్జున సాగర్ (విజయపురిసౌత్)లో నెరవేరడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాగార్జున సాగర్ మత్స్యకేంద్రం అభివృద్ధికి మత్స్యశాఖ నుంచి రూ. 1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి.అయితే.. వైసీపీ నేతలు కమీషన్ల కోసం మత్స్యకేంద్రం అభివృద్ధి ముందుకు సాగకుండా అడ్డుతగిలారు. దీంతో అభివృద్ధి నిలిచిపోయింది. నాగార్జున సాగర్ విజయపురిసౌత్‌లో మత్స్య కేంద్రంను సుమారు 32 ఎకరాలలో 1957లో ఏర్పాటు చేశారు. 150 టన్నుల వరకు చేపలను నిల్వ చేయడానికి శీతల గిడ్డంగిని నిర్మించారు. స్పాన్ ద్వారా చేప పిల్లలను ఉత్పత్తి చేయడానికి 26 సిమెంట్ తొట్టెలు, అందులో చేపలను పెంచడానికి 30 మట్టి తొట్టెలు నిర్మించారు. సుమారు 80 లక్షల నుంచి కోటి వరకు చేప పిల్లలను పెంచడానికి కావాల్సిన అన్ని వసతులు ఇక్కడ ఉన్నాయి. మత్స్యశాఖాధికారులు సిబ్బంది నివసించడానికి పక్కా గృహాలు ఏర్పాటు చేశారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఇక్కడే ఉంది. జలాశయంపై ఆధారపడి 650 కుటుంబాల మత్స్యకారులు నివసిస్తూ.. రోజుకు 150 టన్నుల వరకు చేపలను పట్టేవారు. వీటిని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. ఇక్కడ పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిని ప్రభుత్వం బదిలీపై పంపింది. 1996లో అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి మార్చారు. ఆ తరువాత మరికొంత మంది సిబ్బందిని కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి ప్రదేశాలకు బదిలీ చేశారు. క్రమేణా ప్రయోగశాల మూతపడింది. ఐస్ ఫ్యాక్టరీని నిరుపయోగంగా మార్చారు. సుమారు పదేళ్లపాటు మూసివేశారు.

తిరిగి ప్రారంభమై..

అనంతరం మత్స్యకేంద్రం ప్రారంభమైంది. ప్రస్తుతం మత్స్య కేంద్రంలో ఒక అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఫీల్డ్ మెన్‌లు, ఒక ఫిషర్‌మెన్ విధులు నిర్వహిస్తున్నారు. 12 తొట్లలో చేప పిల్లలను పెంచుతున్నారు. ఇక్కడ ఏటా 4 లక్షల చేప పిల్లలను పెంచి, సాగర్ జలాశయంలో విడుదల చేస్తున్నారు. చేప సీడ్‌ను కూచిపూడి, కైకలూరు ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నారు. నాగార్జున సాగర్ దిగువ కృష్ణానది అతి సమీపంలో ఉన్నప్పటికీ మోటారు బోరు నీటిపైనే మత్స్య సంపద పెంచుతున్నారు. తరచూ నీటి తొట్లు, మోటార్లు రిపేర్లు అవుతున్నా మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చూపుతున్నారు. చేపపిల్ల పెంపక కేంద్రం ఆవరణ మొత్తం చిట్టడవిని తలపించేలా ఉండడం పరిశీలిస్తే నిర్వహణ ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. సుమారు 30 ఎకరాల ఈ మత్స్యకేంద్రంలో చేప పిల్లల పెంపకంతోపాటుగా.. చేపల చెరువును ఏర్పాటు చేసి స్థానిక మత్స్యకారుల సంఘానికి లీజుకు ఇవ్వాలని మత్స్యకారుల సంఘం నాయకులు పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఆచరణకు నోచుకోలేదు.

నాడు చేతులు దులుపుకుని..

నాగార్జున సాగర్ జలాశయంలో ప్రతి ఏటా కోటి 50 లక్షల వరకు చేప పిల్లలను విడుదల చేస్తే మత్స్యకారుల జీవనానికి దోహదపడుతుంది. కానీ, గత వైసీపీ ప్రభుత్వంలో అరకొరగా చేప పిల్లలను విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. కూటమి ప్రభుత్వంలో గత 11 నెలల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యాన 30 లక్షల చేప పిల్లలను సాగర్ జలాశయంలో విడుదల చేశారు. స్థానిక మత్స్యకేంద్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే చేప పిల్లల పెంపుదల గణనీయంగా పెరుగుతుంది.



చేప పిల్లలను పెంచే సిమెంట్ తొట్టెలు



ముళ్ల కంపతో కుచించుకుపోయిన మత్స్య కేంద్రం

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



ఇక్కడ 650 మత్స్యకార కుటుంబాలు చేపల వేటపైనే జీవనం సాగిస్తున్నాయి. ఏటా చేప పిల్లలను విడుదల చేసున్నారు. కానీ, అలు (జీరోసైజు) వలలతో చేపల వేట చేయడంతో మత్స్య సంపద హరించుకుపోతోంది. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సముద్ర ప్రాంతంలో జాలర్లకు ఇచ్చినట్లు మాకూ ప్రోత్సాహం ప్రభుత్వం ఇవ్వాలి.

- మైలపల్లి అప్పలరాజు, మత్స్యకారుడు

మత్స్య సంపద పెంచేలా కృషి చేయాలి



నాగార్జున సాగర్ మత్స్య కేంద్రంలో మత్స్య సంపదను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. మత్స్య కేంద్రంలో చేపల చెరువును ఏర్పాటు చేసి మత్సకారుల సంఘానికి లీజుకు ఇవ్వాలి. ఏటా సాగర్ జలాశయంలో 1.50 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాలి. మత్స్యకారులకు వలలు, రుణాలు, మోటారు సైకిళ్లు ప్రభుత్వం మంజూరు చేయాలి.

- ఎరిపల్లి వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు, మత్స్యకారుల సంఘం

ఆర్టీసీలో..

● త్వరలో ఆర్టీసీ ఇన్‌బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్

● నేరుగా కండక్టర్ వద్దే బుక్ చేసుకోవచ్చు..

కొరియర్ సేవలు సులభతరం



గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ త్వరలో ఇన్ బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్‌ను ప్రారంభించనుంది. ఇప్పటి వరకు ఆర్టీసీ కార్గో పార్శిల్ బుకింగ్ కేంద్రంలోనే ఈ సదుపాయం ఉంది. ఇకపై బస్‌లో కండక్టర్ వద్దనే పార్శిల్ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ మేరకు ఆర్టీసీ యంత్రాంగం ఇన్‌బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్‌పై ప్రచారం చేస్తోంది. త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆర్టీసీలో వస్తువులు, కొరియర్‌లకు బస్టాండ్ ఆవరణతో పాటు ఆర్టీసీ ఆథరైజ్డ్ డీలర్స్ వద్ద మాత్రమే బుకింగ్ సదుపాయం ఉంది. ఇక అలా కాకుండా విలువైన పత్రాలైనా, ఏవైనా వస్తువులను బస్సును ఆపి కండక్టర్ వద్దే పార్శిల్ బుకింగ్ చేసుకొని, గమ్య స్థానాలకు చేర్చుకోవచ్చు. 250 గ్రాముల లోపు నుంచి 5 కేజీల వరకు బుకింగ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. కొరియర్ 250 గ్రాముల వరకు డెలివరీ చార్జి రూ. 80, ఆపై 5 కేజీల వరకు రూ.140లుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. బుకింగ్ సమయంలో బుకింగ్ చేసేవారి, గమ్య స్థానంలో పార్శిల్ తీసుకునే వారి ఫోన్ నంబర్లను ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం తగిన రశీలు పొందవచ్చు. కొరియర్‌లో వస్తువులు నమ్మకంగా గమ్యస్థానాలకు చేరుతాయని అధికారులు భరోసా ఇస్తున్నారు. ఇన్ బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్‌పై ఆర్టీసీ యంత్రాంగం ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే బస్సుల్లో ప్రచారం ప్రారంభించింది. ప్రజలు ఆర్టీసీ ప్రవేశపెట్టిన కొత్త పార్శిల్ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తోంది.

తెలుగు రాష్ట్రాల స్థాయి

నాటిక పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ జయమ్మ

చిలకలూరిపేట, మే16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే తెలుగు రాష్ట్రాల స్థాయి 9వ ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. తొలి రోజున జరిగిన కార్యక్రమంలో సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, సీనియర్ కళాకారులు మల్లాది శివన్నారాయణ, కందిమళ్ల నారాయణమూర్తి, జరుగుల రామారావు, ఇంకా జమాల్ బాషా, డాక్టర్ ప్రత్తిపాటి ప్రఫుల్లాదేవి, గోరంట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు, చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, విజయవాడ మైత్రి కళానిలయం వారి బ్రహ్మ స్వరూపం నాటికలు ప్రదర్శించారు.

ఈ విగ్రహాల.. విలువెంతో..!

● కోర్టు ఆదేశాలతో కదిలిన పురావస్తుశాఖాధికారులు

● రైతు పొలంలో లభించిన విగ్రహాల పరిశీలన

● విలువ లెక్కగట్టే పనిలో రీజినల్ డైరెక్టర్ ఎన్‌కే పాఠక్ బృందం



పొలంలో లభించిన విగ్రహాలు



పురావస్తు శాఖ రీజనల్ డైరెక్టర్ ఎన్‌కే పాఠక్, సిబ్బంది

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాలతో పురావస్తుశాఖాధికారులు తరలి వచ్చారు. రైతు పొలంలో లభించిన విగ్రహాలను ఎట్టకేలకు పరిశీలించారు. బాపట్ల జిల్లాలోని పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన రైతు ఎండీ అన్వర్ ఆలీ అన్సారి పొలం మరమ్మతులు చేస్తుండగా 2003లో విలువైన 4 విగ్రహాలు, పూజా సామగ్రి బయటపడ్డాయి. వీటిని సదరు రైతు చందోలు పోలీసులకు అప్పగించారు. పోలీసులు వాటిని అధికారుల పర్యవేక్షణలో బాపట్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేశారు. అయితే, రైతు అన్వర్ ఆలీ అన్సారి విగ్రహాల విలువలో తనకు వాటా కావాలని 2014లో హైకోర్టును ఆశ్రయించారు. 2023లో విగ్రహాల విలువ లెక్కకట్టమని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికి పురావస్తు శాఖాధికారులు పట్టించుకోలేదు. రైతు తరుపున హైకోర్టు న్యాయవాది కె.జోసఫ్ కోర్టు ధిక్కరణ కేసు వేశారు. దీంతో పురావస్తుశాఖాధికారులు స్పందించారు. బెంగళూరులోని దక్షిణ భారతదేశ పురావస్తుశాఖ రీజినల్ డైరెక్టర్ ఎన్‌కే పాఠక్ బృందం శుక్రవారం బాపట్ల తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి సబ్ ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేసిన విగ్రహాలను తీసుకొచ్చి పరిశీలించారు. బరువు, విలువను లెక్క కట్టారు. నివేదికను కోర్టుకు సమర్పించనున్నట్లు తెలిసింది. డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీఓ పి. గ్లోరియా, బాపట్ల, పిట్టలవానిపాలెం తహసీల్దార్లు షేక్.సలీమా, డి. వెంకటేశ్వరరావు, దేవ దాయ, రెవెన్యూశాఖాధికారులు పాల్గొన్నారు.

లభించిన విగ్రహాలు

రైతు ఆలీ అన్సారీ పొలంలో శ్రీ విష్ణు, శ్రీమహా విష్ణు, శ్రీలక్ష్మీ, నటరాజస్వామి విగ్రహాలు బయటపడ్డాయి. వాటితోపాటు పూజా సామగ్రి ఇతర వస్తువులున్నాయి. ఈ విగ్రహాలు 14వ శతాబ్దానికి పూర్వానివిగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారులు మాత్రం దీనిని ధ్రువీకరించేందుకు అంగీకరించలేదు.

వాటా కావాలి



విగ్రహాలు మా భూమిలో దొరికాయి. కాబట్టి వాటి విలువలో వాటా ఇవ్వాలి. గతంలో వాటి బరువు సుమారు 57 కిలోలు ఉంది. విలువలో 20 శాతం రైతుకు ఇవ్వాలని జీఓ ఉంది. కేరళలో ఇలా దొరికితే వాటి విలువ మొత్తం రైతుకే చెందుతుందని ఉంది. వీటికి సంబంధించిన జీవోలను కోర్టులో సమర్పించాం.

-ఎండీ అన్వర్ ఆలీ అన్సారీ, రైతు

నివేదిక మేరకు ప్రభుత్వం చర్యలు



హైకోర్టు ఆదేశాల మేరకు పురావస్తుశాఖాధికారులు బాపట్ల వచ్చి ట్రెజరీలో డిపాజిట్ చేసిన విగ్రహాలను పరిశీలించారు. వారు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తారు. దాని ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- జి.గంగాధర్‌గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి

భూముల రీ సర్వేలో మన విధానం భేష్

● తమ రాష్ట్రాల్లో అమలు చేస్తామన్న ప్రతినిధులు ● రెండు రోజుల జాతీయ కార్యశాల నిర్వహణతో గుంటూరుకు ఖ్యాతి

● కేంద్ర మంత్రి పెమ్మసాని, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వం



భూ రికార్డుల డిజిటలైజేషన్‌పై రెండు రోజుల కార్యశాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): భూముల సర్వే/రీసర్వే విధానం ఇక్కడ చాలా పకడ్బందీగా జరుగుతోందని, గ్రౌండ్ ట్రూతింగ్, భూమి రికార్డుల స్వచ్ఛీకరణ, డ్రోన్ ఫ్లయింగ్, జియో కో-ఆర్డినేట్స్, అధిక స్పష్టత కలిగిన శాటిలైట్ చిత్రాలు, గ్రీవియన్స్ స్వీకరణ, వాటి పరిష్కారానికి ఏర్పాటు చేసిన యంత్రాంగాలు చాలా భేషుగ్గా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ భూమి రికార్డుల శాఖతో పాటు సర్వే ఆఫ్ ఇండియా, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు ప్రశంసించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడర్‌నైజేషన్ ప్రోగ్రాం కింద గుంటూరు నగరంలోని ఐటీసీ వెల్‌కం హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ కార్యశాల శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా రీసర్వేలో మనం అవలంబిస్తున్న విధానాలను తెలుసుకొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు ఎంతో ఆసక్తి కనబరిచారు. తొలి రోజున వట్టిచెరుకూరులోని అనంతవరప్పాడులో జరిగిన ఫీల్డ్ విజిట్‌లోనూ అనేక అంశాలను తెలుసుకొన్నామని వారు చెప్పారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎంతో చొరవ తీసుకొని జాతీయ స్థాయి వర్కుషాప్ నిర్వహణకు గుంటూరుని వేదికగా చేయడం ద్వారా ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చారని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ అధికారులు ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తక్కువ వ్యవధిలో వర్కుషాప్ నిర్వహణకు సకల ఏర్పాట్లు చేసిన గుంటూరు జిల్లా యంత్రాంగాన్ని స్పెషల్ సీఎస్ జయలక్ష్మి అభినందించారు. అలానే కర్ణాటక, ఒడిస్సా, అస్సాం, లద్దాక్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న రీసర్వే విధానం, అనుభవాలను పంచుకొన్నారు. అంతిమంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డీఐఎల్ఆర్ఎంపీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రోత్సాహకాలు అందుకోవాలని అన్ని రాష్ట్రాల అధికారులు నిర్ణయించారు. చివరి రోజున మునిసిపల్ మంత్రి నారాయణ నక్షా కార్యక్రమంపై చేసిన ప్రసంగం అందరిని ఆకట్టుకుంది.

కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రటరీ మనోజ్ జోషి ప్రసంగాన్ని అందరూ శ్రద్ధగా ఆలకించారు. నాణ్యమైన భూ రికార్డులు నిర్వహించే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ దాదాపు రూ.1000 కోట్ల వరకు ప్రోత్సాహక నిధులను అందిస్తుందని ఆయన చెప్పారు. ఆర్వోఆర్‌లో 80 శాతంకు పైగా వ్యక్తిగత ఖాతాలు ఉంటే దానిని నాణ్యమైన భూ రికార్డులుగా గుర్తించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 90 శాతానికి పైగా డిజిటలైజ్డ్ చేసిన భూ ఖాతాలలో వ్యక్తిగత ఖాతాలు ఉండటంతో అత్యధికంగా ప్రోత్సాహక నిధులు అందుకోవటం జరిగిందని ఉదహరించారు. జాతీయ వర్క్ షాపు వలన రాష్ట్రాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే పై కేంద్ర ప్రభుత్వ భూవనరుల శాఖకు అవగాహన వచ్చిందన్నారు. అదే విధంగా రాష్ట్రాలకు ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న రీ సర్వే చేస్తున్న విధానం తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. మానవ వనరులను ప్రణాళిక ప్రకారం వినియోగించుకొని రీ సర్వేను నిర్దేశించిన లక్ష్యాల అధిగమించేలా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి కేంద్ర భూ వనరుల శాఖ సర్వే రీ సర్వే , నక్షా కార్యక్రమాలకు వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న నిధులు, ప్రోత్సాహకాలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు భూముల రీ సర్వేకు సంబంధించి తెలిపిన అనేక సందేహాలకు కేంద్ర భూ వనరుల శాఖ అధికారులు నివృత్తి చేశారు. ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తే జ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సం జనా సింహా, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఐదేళ్లు..5 ప్రభుత్వ ఉద్యోగాలు

ఆదర్శంగా నిలుస్తున్న మాజీ సైనికుడు



పొన్నూరుటౌన్, మే 16: భారత సైన్యంలో పదిహేడున్నర సంవత్సరాలు సేవలు అందించిన మాజీ సైనికుడు.. పదవీ విరమణ తర్వాత ఐదేళ్లలో ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరి మన్ననలు అందు కుంటున్నాడు. బాపట్ల జిల్లా చందోలు గ్రామానికి చెందిన మహ మద్ గౌస్ కుటుంబం పొన్నూరు పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులో స్థిరపడింది. సైన్యంపై మక్కువతో 2003లో 10వ తరగతి విద్యర్హతతో ఆర్మీలో చేరిన గౌస్ ఓ వైపు సిపాయిగా పని చేస్తూనే ఎంఏ ఎకనామిక్స్, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ ఇన్‌ఫర్మేషన్ సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యను పూర్తిచేశారు. హవాల్దార్‌గా, టీచర్ ట్రైనర్‌గా పలు విభాగాల్లో పని చేసిన గౌస్ 2020లో పదవి విరమణ చేశారు. అనంతరం పొన్నూరు వచ్చి.. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్టాఫ్ సెలక్షన్ పరీక్షలతో పాటు, వివిధ పరీక్షలు రాశారు. జనరల్ కేటగిరిలో కోల్ ఇండియాలో షావల్ మిషన్ ఆపరేటర్‌గా తొలి ఉద్యోగాన్ని సాధించారు. అనంతరం ఇస్రో ఏ గ్రేడ్ వెహికల్ ఆపరేటర్‌గా, మరోసారి రాసిన పరీక్షలలో ఇస్రో లైట్ వెహికల్ ఆపరేటర్‌గా మొదటిసారి రాసిన పరీక్షల్లో జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ నిర్వహించిన పరీక్షలలో శాస్త్రవేత్తలకు డ్రైవర్‌గా ఎంపికయ్యారు. ఈ ఉద్యోగం చేస్తూనే జైళ్ల శాఖ నిర్వహించిన పరీక్షలకు హాజరైన గౌస్.. స్టాఫ్ డ్యూటీ ఉద్యోగానికి ఈ మే నెలలో ఎంపికయ్యారు. ప్రస్తుతం జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో స్టాఫ్ డ్యూటీలో చేరారు. ఒక ప్రభుత్వ ఉద్యోగం రావాలంటేనే ఎంతో శ్రమకోర్చి సిద్ధం అవ్వాల్సిన ప్రస్తుత తరుణంలో.. జనరల్ క్యాటగిరిలో ఐదేళ్ల కాలంలో ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు గౌస్ సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

అమ్మో పిడుగు!



అప్రమత్తతోనే రక్షణ

● వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు ● జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు

సత్తెనపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు పలు ప్రాంతాల్లో మనుషుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ప్రస్తుతం చిన్నపాటి మేఘాలు కమ్మినా.. వాతావరణం భీకరంగా మారిపోతోంది. వెంటనే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం అప్పుడప్పుడు పిడుగులు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితికి వాతావరణంలోని మార్పులు ఒక కారణంగా కాగా.. మానవ తప్పిదం కూడా ఒక కారణమని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూ ఉపరితలం నుంచి ఎంత ఎత్తులో మేఘాల మధ్య ఘర్షణ నెలకొన్నా.. పిడుగులు తీవ్రత ఒకేలా ఉంటుందని, గాలి పీడనంలో వ్యత్యాసాలు, మేఘాల కదలికలపైన ఆధారపడి ఉంటాయన్నది వాతావరణ శాఖ నిపుణుల అభిప్రాయం. భూ ఉపరితలంలో 16 కిలో మీటర్ల నుంచి 13 కిలో మీటర్ల మధ్య మేఘాలు ఏర్పడతాయి. రెండు మేఘాల మధ్య ఘర్షణ నెలకొని అత్యధిక విద్యుతావేశం ఉద్భవిస్తుంది. ఆ సమయంలోనే ప్రశాంతమైన కాంతి, అధిక ధ్వని వెలువడతాయి. కాంతి వేగం ఎక్కువ కావడం వల్ల మొదట మెరుపు, తర్వాత ధ్వని వినిపిస్తుంది. మెరుపు ఎక్కువగా విస్తరిస్తే భూమిపై పిడుగు ప్రభావం తక్కువగా ఉంటుంది. మెరుపు ఒకే చోట మెరిసి శబ్దం చేస్తే దాని ప్రభావం భూ ఉపరితలం పై ఎక్కువగా ఉంటుంది. పిడుగు పడిన శబ్దం 24 కిలోమీటర్ల పరిధిలో అందరికీ వినిపిస్తుంది. ఆ సమయంలో 14 కిలో మీటర్ల పరిధిలో వర్షం కురిసే అవకాశం ఉంది. ఎత్తైన ప్రదేశాలు, చెట్లపై, తడిగా ఉన్న ప్రాంతాల్లో పిడుగులు పడతాయి. ఎలక్ట్రానిక్స్, విద్యుత్ పరికరాలను పిడుగులు వేగంగా ఆకర్షిస్తాయి. అందుకే వర్షంలో సెల్ ఫోన్ వాడకూడదు. వర్షంలో తప్పనిసరిగా ప్రయాణించాల్సి వస్తే సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేస్తే మంచింది. మనం ప్రయాణించే సమయంలో ఎక్కడ పిడుగులు పడినా సెల్ ఫోన్‌లు ఆకర్షిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ముందస్తు హెచ్చరిక కీలకం



భారీ వర్షాలు, పిడుగులకు సంబందించిన సమాచారాన్ని వాతావరణ శాఖ మెసేజ్ రూపంలో తెలియజేస్తుంది. ఇలాంటి సమాచారాన్ని తేలిగ్గా తీసుకోకుండా ప్రజలు కచ్చితంగా సూచనలు పాటిస్తే మంచిది. వర్షం కురిసే సమయంలో తడిచి వెళ్లినా పర్వాలేదు, కాని తాటి, టేకు, కొబ్బరి తదితర చెట్ల కింద ఉండకూడదు. గొడుగు వేసుకుని వెళ్లడం ప్రమాదానికి సంకేతం. కార్లు, వాహనాల్లో ప్రయాణించే వారు ప్రయాణాన్ని ఆపివేస్తే మంచిది. వెళ్లాల్సి వస్తే కారు అద్దాలన్నింటినీ మూసి వేయాలి. రైతులు, పశువుల కాపర్లు, కూలీలు బహిరంగ ప్రదేశాల్లో పని చేసే వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. ఇళ్లపై ఎత్తయిన ప్రదేశాల్లో మెటల్ రాడ్‌ను బిగించాలి. పిడుగు పడితే ఇది ఆకర్షించి ప్రమాదం జరిగే అవకాశం తక్కువగా ఉంటుంది.

- చొప్పర కమలాకర్, సైన్స్ ఉపాధ్యాయుడు, వెన్నాదేవి ఉన్నత పాఠశాల, సత్తెనపల్లి

అవీ..ఇవీ..

సెజ్‌కు మామిళ్లపల్లి రైతుల వ్యతిరేకత

సంతమాగులూరు మే 16 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలంలోని కుందూరు, మామిళ్ళపల్లి గ్రామంలో శుక్రవారం పునర్ ఉత్పాదక ఇంధన తయారీ ప్లేట్ల కేంద్రాన్ని స్థానిక రైతులు వ్యతిరేకించారు. 1700 ఎకరాలు భూ సేకరణకు సంబంధించి ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ రవిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వివరాలను ఆర్‌డీవో వెల్లడించారు. దీనిపై రైతులను అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. కుందూరు గ్రామానికి సంబంధించిన రైతులు కొంతమంది సముఖత వ్యక్తం చేయగా, మామిళ్లపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ భూములను ఇవ్వడానికి అంగికరించడం లేదు. తమకు జీవనోపాధి ఇదేనని తమ భూములు ఇవ్వడానికి తాము ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామని ఆర్‌డీవో టి చంద్రశేఖర్ కు లిఖితపూర్వకముగా అర్జీని సమర్పించారు. రాసిన అర్జీని గ్రామసభలో ఆర్ఐ సమక్షంలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది అధికారులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

యద్దనపూడి, (మార్టూరు)మే 16 (ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని యద్దనపూడి టీడీపీ కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ఆపరేషన్ సిందూర్ ర్యాలీని పార్టీనాయకులు గ్రామంలో నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రారంభానికి ముందు పాకిస్థాన్‌తో చేసిన యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరజవాను మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు చేశారు. తరువాత గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో నల్లపనేని రంగయ్యచౌదరి కనపర్తి నాగేశ్వరరావు, గుదే తారకరామారావు, గొట్టిపాటి సతీష్, రావిపాటి సీతయ్య, కొరటాల వంశీకృష్ణ, కోయ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ వ్యాయామంతో ఆరోగ్యం



పుస్తకాలు అందజేస్తున్న వైద్యులు

బల్లికురవ. మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజు వ్యాయామంతో ఆరోగ్యవంతులుగా జీవించవచ్చు అని ఎంపీడీవో కుసుమ కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిజామ్ ఫీజీయో థెరపీ డాక్టర్స్‌చే ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఫీజీయో థెరపీ వైద్యులు వెంకటరమణ, రామ్‌జీ గోవిందాలు మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియెగం పెరిగి ప్రతి ఒక్కరు మానసిక ఒత్తిడికి చెందుతున్నారని తెలిపారు. ప్రతి రోజు కొంత సేపు వ్యాయమం చేయాల న్నారు. అలానే ప్రశాంత వాతావరణంలో కొంత సేపు ఉండాలన్నారు. ఎంత ఒత్తిడి ఉన్న ఉద్యోగులు క్రమం తప్పకుండా వాకింగ్ చేయాలన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అద్దంకిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగపర్చుకుని కుటుంబ ఆదాయ వనరుగా ఉపయోగించుకోవాలని ఎంపీడీవో బత్తిన శింగయ్య అన్నారు. శుక్రవారం అద్దంకి పట్టణంలోని రూరల్ గ్రామాల మహిళలకు సంజీవనగర్‌లో జరుగుతున్న ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని ఎంపీడీవో సింగయ్య, ఈవోపిఆర్‌డి ఆర్‌వీఎస్ ప్రసాదరావులు సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వహణ, కల్పిస్తున్న వసతులు, శిక్షకుల హాజరు శాతాలను ఆయన పరిశీలించారు. ఉచిత శిక్షణ కోసం అ వసరమైన వసతులు ఇబ్బందులు లేకుండా ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. శిక్షణ పొందుతున్న మహిళలు వంద శాతం హాజరు అ య్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం నిర్వహకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం

అద్దంకిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉ మమహేశ్వరావు అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఉమమహేశ్వరావు మాట్లాడుతు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌ల ద్వారా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయడం ద్వారా కార్మికులు తమ హక్కులను కాపాడుకోవచ్చన్నారు. మున్సిపల్ కార్మికులను కార్మికులుగా గుర్తించకుండా ప్రభుత్వ ఉద్యోగుల జాబిత ప్రకారం ఎటువంటి సంక్షేమ పథకాలకు అర్హులు కాకుండా చేస్తున్నారన్నారు. ఈ నెల 20న జరగాల్సిన సార్వత్రిక దేశవ్యాప్తసమ్మె జూలై 9వ తేదికి వాయిదా పడిందని, 20న నిరసన ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందర్, నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఆదాము, గాలి భీష్మా, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఏపీపీటీడీ జోన్- 3 పరిధిలోని వివిధ బస్‌స్టేషన్, బస్ డిపోలలో ఖాళీగా ఉన్న 26 ఓపెన్ ప్రదేశాలను 15 సంవత్సరముల లీజు పద్ధతిలో అందించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించిన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. పర్చూరు బస్టాండ్ - 778 చదరపు గజాలు (చ.గ) పర్చూరు బస్టాండ్ బిట్ -2లో 37.92 చ.గ, చీరాల గ్యారేజీ సమీపంలో 52,950 చ.గ, వేటపాలెం బస్టాండ్ 2619 చ.గ, ఇంకొల్లు 24200 చ.గజాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అలాగే చీరాల ఆర్టీసీ డిపోలో ఈ నెల 24న అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరములకు 73828 88506 నెంబర్‌ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నుంచి ప్రారంభమై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డా.యాకోబు మాట్లాడుతూ ఈ ఏడాది చెక్, క్లీన్, కవర్ అనే నినాదాలతో ప్రతి ఇంటిని సందర్శించాలని సూచించారు. తద్వారా పరిసరాల్లో మురుగు నిల్వలు, కుంటలు వంటివి పరిశీలించడం సులువుగా ఉంటుందన్నారు. పరిసరాల పరిశుభ్రత లేమితో డెంగ్యూ వంటి ప్రాణాంతక సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.మనీష్ నంద, డా.శిరీష, డా.ప్రణయ్, మలేరియా అధికారి శేషుబాబు, దాస్, అనీల్, బేబిమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాకుంభాభిషేక పూజలు

- కలశయాత్రకు ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- రాతిముఖ మండప నిర్మాణానికి విరాళం

అద్దంకి, మే 16 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మహాకుంభాభిషేకము పూజలు మూడవరోజు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శింగరకొండ క్షేత్రాధిపతి లక్ష్మీ నరశింహ స్వామి దేవాలయంలో పసన్నాంజనేయస్వామి దేవాలయం ఈవో అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, రిషిత దంపతులు, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం, జీవధ్వజస్తంభం దాతలు నలమలపు విజయభాస్కరరెడ్డి, శ్రీదేవి దంపతులు, కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి దంపతులు, గుంజి కృష్ణారావు, రమాదేవి దంపతులు, కాట్రగడ్డ అనిల్‌కుమార్, శ్రీవిద్య దంపతులు, మేదర మెట్ల రాజశేఖరరెడ్డి, చంద్రశేఖరరెడ్డిలు దంపతులతో కలిసి లక్ష్మీనరశింహస్వామి వార్లకు విశేష ద్రవ్యాలతో పంచామృతాభిషేకము, సహస్రనామ తులసీదళార్చన నిర్వహించారు. లక్ష్మీనరశింహస్వామి దేవాలయం ఈవో మద్దినేని శ్రీనివాసరావు, శిద్దా హనుమంతరావు దంపతులు, సందిరెడ్డి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్, గట్టుపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద గురువందనం, గణపతిపూజ, మండప పూజలు, మహన్యాసపారాయణం, రుద్రపారాయణం, సూర్య నమస్కారాలు, మంత్రఅనుష్టానం, వేదపారాయణం, సుదరకాండ పారాయణం, జలాధివాసము నిర్వహించారు. శుక్రవారం రాత్రి ప్రదర్శించిన శ్రీనివాసకళ్యాణం, కూచిపూడి నృత్య ప్రదర్శన, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 19న జరిగే మహాకుంభాభిషేకమునకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మహాకుంభాభిషేక కలశయాత్రకు ఏర్పాట్లు

అద్దంకి, మే16 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మహాకుంభాభిషేకం సందర్భంగా నిర్వహించే కలశయాత్రకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. 19న ఉదయం 9.03 గంటలకు శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో 19న ఉదయం 5 గంటలకు అద్దంకి పట్టణంలోని పాత దర్శి రోడ్డులో గుండ్లకమ్మనది నుంచి సుమారు 1500 మంది మహిళలు కలశములతో నీటిని తీసుకొని శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వరకు పాదయాత్రగా చేరుకుంటారు. ఐదు నదులు, మూడు సముద్రాల నుంచి ఇప్పటికే తీసుకొచ్చిన జలంతో పాటు గుండ్లకమ్మనది నుంచి మహిళలు కలశములతో తీసుకు వచ్చిన జలాన్ని మహాకుంభాభిషేకంలో వినియోగించ నున్నారు. గుండ్లకమ్మనది నుండి మహిళలు తీసుకు వచ్చే కలశములను పసుపు, కుంకుమ పూసి, పసుపుకొమ్ములు కట్టి సిద్ధం చేస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల మహిళలు కలశముల అలంకరణ పనులు శింగరకొండ లో చేస్తున్నారు.



లక్ష్మీనరశింహస్వామి అభిషేకానికి పూజా సామగ్రితో వెళుతున్న ఏసీ తిమ్మనాయుడు, రిషిత దంపతులు, దాతలు

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం నిర్మాణానికి పలువురు దాతలు శు క్రవారం విరాళాలు అందజేశారు. మండలంలోని నాగులపాడుకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి అడుసుమల్లి కిషోర్, పార్వతి దంపతులు రూ.1,00,116 లు, కలవకూరు కు చెందిన గూడా వెంకటనారాయణరెడ్డి జ్ఞాపకార్థం కుమారులు రూ.1,11,116లు, అద్దంకి పట్టణంలోని కాకానిపాలేనికి చెందిన గడ్డం బసవయ్య జ్ఞాపకార్థం భార్య వెంకటరత్నం రూ.1,01,116లు, పాములపాటి శంకరనాగసాయి మణికంఠ రూ.1,00,232 రూపాయలను ఈవో తిమ్మానాయుడు కు అందజేశారు.







కలశాలను సిద్ధం చేస్తున్న మహిళలు, లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న ఈవో, అర్చకులు, మండపానికి విరాళం అందజేస్తున్న అడుసుమల్లి పావని

గుండ్లకమ్మ వంతెనపైనే నిలిచిన వర్షపునీరు

అద్దంకిలో 47.4 మి.మీ వర్షపాతం నమోదు

అద్దంకి, మే16 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో శుక్రవారం 47.4 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. వేకువజామున ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అద్దంకి పట్టణం సమీపంలోని గుండ్లకమ్మ నది వంతెనపై వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారింది. నీరు కిందకు వెళ్లేతూములు పూడిపోవడంతో వంతెనపైనే నిలిచిపోయాయి. అసలే శిథిలావస్థకు చేరిన వంతెన కావడంతోపాటు నీరు నిలవడంతో గోతులు మరింత పెద్దవగా మారాయి. గోతులలో నీరు నిలిచి వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. గోతులను గమనించకుండా వేగంగా వెళ్తుండడంతో బురద నీరు చింది ద్విచక్ర వాహనచోదకులపై పడి ఇబ్బంది పడ్డారు. కనీసం వర్షపు నీరు కిందకు పోయే విధంగా చర్యలు చేపట్టక పోవడంతో పాటు బ్రిడ్జిపైన పేరుకు పోయిన మట్టిని ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. కొద్ది ప్రాంతాలలో మొక్కజొన్న పంట కోత దశలో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



గుండ్లకమ్మ వంతనపై నిలిచిన వర్షపునీరు

అకాల వర్షంతో రైతులు పరుగులు

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులు భారీ వర్షం కురవడంతో పంటలు సాగు చేసిన రైతులు పరుగులు పెట్టారు. పలు గ్రామాలలో మిర్చి, మొక్కజొన్న కల్లాల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచింది. దీంతో రైతులు పంటలకు పరదాలు కప్పి పంటలను కాపాడుకొనే ప్రయత్నం చేశారు. బల్లికురవ మండలంలోని రామాంజనేయుపరం, సోమవరప్పాడు, ఉప్పుమాగులూరు,. కొత్తూరు, వెలమవారిపాలెం తదితర గ్రామాలలో ఎండు మిర్చి కోతలు తుది దశలో ఉన్నాయి రైతులు మిర్చిని కల్లాల్లో ఆర బెట్టారు. ఉన్నట్టు ండి ఒక్కసారిగా భారీ వర్షం గాలులు రావటంతో రైతులు పంటలను కాపడుకోనేందుకు పడరాని పాట్లు పడ్డారు. చెన్నుపల్లి గ్రామంలో బోరు బావుల ద్వారా సాగు చేసిన నూగు పంట నేల కరిచింది. ఎండల ప్రభావం నుండి భారీ వర్షంతో వాతావరణం చల్లబడింది. ఉరుములు, గాలుల ప్రభావానికి విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలిగింది.

అర్ధరాత్రి కత్తులతో ఇరువురిపై పలువురు దాడి

- పారిపోయి ప్రాణాలు కాపాడుకున్న యువకులు
- పలుచోట్ల స్వల్ప గాయాలు
- కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి ఆరుగురు వ్యక్తులు బీభత్సం సృష్టించారు. మద్యంసేవించి వాహనాలు నడుపుతూ ప్రయాణికులను భయభ్రాంతులు చేశారు. స్థానిక ఎల్‌బీఎస్‌నగర్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్లా, బాజీ ద్విచక్ర వాహనంపై బస్టాండ్‌లో స్నేహితుడిని కలిసేందుకు వెళ్లారు. అయితే అప్పటికే అటువైపు రెండు ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న ఆరుగురు వీరి వద్దకు వచ్చి వాదనకు దిగారు. వారి వద్ద ఉన్న కత్తితో ఎటువంటి సంబంధాలు లేని వీరిపై పలుచోట్ల దాడి చేశారు. దీంతో వీరు భయాందోళనతో పారిపోయిప్రాణాలు కాపాడుకున్నారు. ఈ నేపథ్యంలో స్వల్ప గాయాలతో చికిత్స పొంది శుక్రవారం ఉదయం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారి కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అయితే నిందితులు కొంతకాలంగా వైకుంఠపురం మీదుగా స్వర్ణ, ఇంకొల్లు తదితర ప్రాంతాలకు వెళ్లే వారిపై అర్ధరాత్రులు దాడులకు పాల్పడి నగదు దోచుకుంటున్నట్లు సమచారం. ఆరుగురు వ్యక్తులు (వీరిలో ఒకరు రౌడీ షీటర్) కొత్తపాలెంలో అల్లరి మూకలను తయారు చేసి విధ్వంసాలు సృష్టిస్తున్నట్లు పోలీసులు తెలుసుకుని విచారిస్తున్నారు.

సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన ఆరు వాహనాలకు సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. దీంతో వేలంలో సుమారు 9 మంది పాల్గొని రెండు స్కూటీలు, ఒక ద్విచక్ర వాహనం, అప్పీ ఆటోను దక్కించుకున్నారు. దీంతో ప్రభుత్వానికి రూ.1.38 లక్షలు ఆదాయంతో పాటు కొనుగోలుపై అదనంగా 18 శాతం జీఎస్‌టీ సమకూరిందని సీఐ తెలిపారు.

ఇది విజయవంతమైన ప్రజాదర్బార్..

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ప్రజాదర్బార్ విజయవంతమైందని ఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, తదితర టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశానుసారం శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి 95 అర్జీలు స్వీకరించారు. అందులో నివేశన స్థలాలు 60, పెన్షన్ 20, ఇతర సమస్యలు 15 ఉన్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే దృష్టికి చేర్చి సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో గంజి పురుషోత్తం, రావినూతల నాగేశ్వరరావు, అంగిరేకుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

పంగులూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు విధిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని తహసీల్దార్ సింగారావు కోరారు. మండలంలోని కోటపాడు, బూదవాడ గ్రామాలలో శుక్రవారం కౌలు రైతులకు సీసీఆర్‌సీ. కార్డుల ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుర్తింపు కార్డు పొందిన వారికి రైతులకు అందే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సున్నావడ్డీకి పంటరుణం, అన్నదాత సుఖీభవతో పాటు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, విత్తనాలు, ఇతర రాయితీలు పొదవచ్చన్నారు. గుర్తింపు కార్డు కొరకు కౌలు రైతులు వీఆర్‌వో, వీఆర్‌ఏలకు సంబందిత పత్రాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వీఆర్‌వోలు బుల్లయ్య, నాని, వీఆర్‌ఏలు అక్షా రాణి, అలగ్జాండర్, పలువురు కౌలురైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

బల్లికురవ : గ్రామాలలో కౌలు రైతులకు సాగుదారు హక్కు పత్రాలను అందజేస్తా మని ఏవో కుమారి తెలి పారు. శుక్రవారం మండలం లోని ముక్తేశ్వరం, బల్లికురవ గ్రామాలలో కౌలు రైతుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతు భూములు కలిగిన రైతులు కౌలు రైతులకు సాగుదారు హక్కుపత్రాలు అందిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. సమావేశంలో వీఆర్‌వో అశోక్ పాల్గొన్నారు.







అచెంచల విశ్వాసంతో అద్భుత క్షేత్రంగా..

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం గత శతాబ్దం క్రితం ప్రసిద్ధక్షేత్రంగా ఉద్భవించింది. అప్పటి దేవాలయం చిత్రాలను చూస్తే నేటి యువత ఆశ్చర్యానికి గురవుతుంది. ఒకప్పుడు ఆలయం వద్ద తాటాకు పందిళ్లు మాత్రమే ఉండేవి. చుట్టూ రాజగోపురాలు లేవు. ప్రహరీ కూడా లేదు. ప్రస్తుతం రాతి మండపం నిర్మాణంతో దేవాలయం అద్భుత క్షేత్రంగా రూపుదిద్దుకొంది. మరో నాలుగైదు సంవత్సరాలలో మరింత మార్పు రానుంది. నాలుగు వైపులా రాజగోపురాలు, ప్రాకార మండపాలను పూర్తిగా రాతి తో నిర్మించనున్నారు. - అద్దంకి, ఆంధ్రజ్యోతి

అనుమానాలు కాదు... ఆధారాలే ముఖ్యం

ముప్పా సురేష్ కీలక కుట్రదారుడే

అతడిని, అతని వెనుక ఉన్న వారినీ వదలం

- సిఫారసులు లేవు, ఒత్తిళ్లు అంతకన్నా లేవు
- అరెస్టులే కాదు.. వారికి శిక్షపడే విధంగా చేస్తాం
- వీరయ్య హత్య కేసు దర్యాప్తుపై ఎస్పీ దామోదర్
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు అనుమానాలపై స్పష్టత



(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

'ప్రజల అనుమానాలు, అపోహల కన్నా దర్యాప్తులో వెల్లడైన నిజాలు, లభించిన ఆధారాలే ముఖ్యం. తదనుగుణంగానే టీడీపీ నేత ముప్పవరపు వీరయ్యచౌదరి కేసులో ముందుకెళ్తున్నాం. ఈ కేసులో ముప్పా సురేష్ పాత్ర కీలకం. హంతకుల్లో నాగరాజు పాత్ర కూడా ఎక్కువే. వారిని వదలం. ముఖ్యంగా సురేష్ వెనకున్న వారిని వదిలే ప్రసక్తే లేదు. కుట్రదారులు, హంతకులను అరెస్ట్ చేయడమే కాదు. వారికి శిక్షపడే విధంగా కేసును ముందుకు తీసుకువెళ్లడం మా లక్ష్యం' అని ఎస్పీ దామోదర్ స్పష్టం చేశారు. టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్య కేసులో కొందరిని అరెస్ట్ చేశామని, మరికొందరి కోసం గాలిస్తున్నామని ఇటీవల ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే దర్యాప్తుపై కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఎస్పీ దామోదర్ స్పష్టమైన సమాధానాలు ఇచ్చారు.

నిష్పక్షపాతంగా దర్యాప్తు

వీరయ్య చౌదరి హత్య కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగిందని ఎస్పీ చెప్పారు. నిత్యం డీజీపీ పర్యవేక్షించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు కూడా దర్యాప్తునకు అనుగుణంగానే ముందుకు సాగాలని చెప్పారని ఒక ప్రశ్నకు బదులుగా ఎస్పీ స్పష్టం చేశారు. నిందితులు ఎవరనేది మాకు ముఖ్యం కాదు.. వారు ఏ పార్టీ అనేది అనవసరం. ఆ తరహాలోనే దర్యాప్తు చేశామని వెల్లడించారు. అనుమానితులుగా గుర్తించి ఇప్పటికే చాలామందిని విచారించామన్నారు. దర్యాప్తులో వెల్లడైన విషయాలకు అనుగుణంగా ఆ కేసులో అనుమానం ఉన్న వారినే నిందితులుగా తీసుకున్నామని తెలిపారు. మరో ప్రశ్నకు బదులుగా ఏ దశలోనూ రాజకీయ దురుద్దేశంతో ముందుకు పొమ్మని మాకు సిఫారసు చేసిన వారు గానీ, బలవంతం చేసిన వారుగానీ లేరన్నారు. ఈ విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా ముందుకు సాగారనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు.

కుట్రలో సురేష్ పాత్ర కీలకమే

'అమ్మనబ్రోలు గ్రామానికి చెంది హైదరాబాద్‌లో ఉంటున్న ముప్పా సురేష్ కూడా వీరయ్య హత్యకేసులో ప్రధాన కుట్రదారుడే. అందుకు తగిన ఆధారాలు మావద్ద ఉన్నాయి. అతన్నే కాదు. అతనికి అండగా ఉన్నవారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదు' అరి ఎస్పీ స్పష్టం చేశారు. ఈ విషయంలో వెల్లడైన కొన్ని అనుమానాలను ఆంధ్రజ్యోతి వ్యక్తంచేయగా అవి అనుమానాలే. మేము నిజాలకు అనుగుణంగా ముందుకుపోతున్నాం. ఆయన ఎవరు, ఏపార్టీ, ఏస్థాయి వారు, ఎవరు మద్దతు ఉందనేది మాకు అనవసరమని చెప్పారు. మరొక ప్రశ్నకు బదులుగా ముప్పా సురేష్ దేశంలోనే ఉన్నారు. మాకు దొరకాల్సిందే. ఒంగోలు జైలుకు వెళ్లాల్సిందేనని ఎస్పీ కరాఖండిగా చెప్పారు. ఆయన్ని తప్పించాలని ఒత్తిడి మీకు వచ్చింది కదా.. ఫోన్‌లో మీడియాకు అందుబాటులో ఉన్న వ్యక్తి మీకు ఎలా దొరకకుండా ఉన్నారని ప్రజలు అనుమానిస్తున్నారని ప్రశ్నించగా.. 'అనుమానాలు, అపోహలు వేరు. కుట్రదారుల్లో అతని పాత్ర ఉందని మేము గుర్తించాం. ఆధారాలు సేకరించాం. తదనుగుణంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడం ఖాయం. అలాగే దర్యాప్తు ఇంతటితో పూర్తికాలేదు. సురేష్ వెనుక ఎవరున్నారన్న అంశంపై కూడా విచారిస్తున్నాం. కచ్చితంగా కూపీ లాగుతాం. ఎవరు ఉన్నా వదిలే ప్రసక్తే లేదు' అని ఎస్పీ వెల్లడించారు. ఇంకో ప్రశ్నకు బదులుగా అతను ఏ రాజకీయ పార్టీ అనేది మాకు ముఖ్యం కాదు. కానీ మీరన్నట్లు ప్రధానంగా వైసీపీ నాయకులతో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఉదంతాలు మా దృష్టికి వచ్చాయని ఎస్పీ చెప్పారు. ఇంకో ప్రశ్నకు బదులుగా ఇంకా మాకు దొరకని వారిలో నాగరాజు అనే నిందితుడు హంతకులలో ఒకరు. హతుడు వీరయ్యను ఒక పక్క నుంచి వంశీ కత్తితో పొడవగా, రెండో పక్క నుంచి నాగరాజు కూడా పొడిచాడు. నాగరాజును తప్పకుండా పట్టుకొస్తాం. జైలుకు పంపుతామన్నారు. ఇప్పుడేదో అరెస్ట్ చేసి చేతులు దులుపుకోవడం కాదు. తుది విచారణలో కుట్రదారులకు, హంతకులకు శిక్షపడే విధంగా సేకరించిన ఆధారాలతో ప్రాథమిక దర్యాప్తు గానీ, చార్జ్‌షీటును కానీ రూపొందిస్తున్నామని ఎస్పీ చెప్పారు. మా లక్ష్యం అరెస్టు చేయడం కాదు. కోర్టులో అందరికి శిక్షపడటమేనని స్పష్టం చేశారు.

అవీ..ఇవీ..

డెంగ్యూవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

చినగంజాం, మే 16 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్ అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది శుక్రవారం చినగంజాంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చీరాల మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. నీటి నిల్వలపై మూతలు ఏర్పాటు చేయాలన్నారు. వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వినియోగించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే పాటించడం ద్వారా డెంగ్యూవ్యాధిని, వాటికి కారాణమైన డెంగ్యూ దోమలను అరికట్టవచ్చునని తెలిపారు. డెంగ్యూ వ్యాధి దోమల వ్యాప్తి నిర్మూలన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీ.హెచ్‌వో, సీహెచ్ఎన్, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంజేఏవై కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

చినగంజాం, మే 16(ఆంధ్రజ్యోతి) : 60 సంవత్సరాలు దాటిన వారికి కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన ఆరోగ్య కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కే.కీర్తిసరోజ్, ఎన్‌టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ సీ.హెచ్. ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజలకు పీఎంజేఏవై కార్డులపై శుక్రవారం సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది, ఆరోగ్యమిత్రులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్రప్రభుత్వం అందజేస్తున్న పీఎంజేఏవై కార్డులతో దేశంలో ఎక్కడైనా వైద్యఖర్చుల నిమిత్తం ఐదు లక్షల రూపాయిల వరకు ఆరోగ్య సేవలు పొందవచ్చునని వైద్యాధికారి తెలిపారు. కడవకుదురు గ్రామ పంచాయతీ పరిధిలో ఈకేవైసీ చేసిన 395 మందికి ఆన్‌లైన్‌లో కార్డుల కొరకు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది డెంగ్యూ వ్యాధిపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పీహెచ్‌సీ హెచ్ఈవో యూ.వెంకటరమణ, సూపర్‌వైజర్లు శ్రీధర్, మాధవి, వరదానం, 104 డిఈవో పొదిలి రాఘవ, హెల్త్ అసిస్టెంట్ జి.విజయప్రసన్న, ఆరోగ్యమిత్రలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు తిరుమలకు కూరగాయలు

మార్టూరు,మే16(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆదివారం మార్టూరు నుండి 80 వేల మందికి సరిపడా కూరగాయలను పంపిస్తున్నట్లు మార్టూరులోని శ్రీవెంకటేశ్వరస్వామి భక్త సమాజం వారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమలలోని అన్నదానసత్రానికి మార్టూరులో ఉదయం 8 గంటలకు బొడ్డురాయి సెంటరు నుంచి కూరగాయలను తీసుకొవెళ్లే వాహనం బయలుదేరుతుందన్నారు. ఈ శ్రీవారి వాహనం కు పూజా కార్యక్రమాలను నిర్వహించి ఊరే గింపుగా బయలుదేరి పెద్దఖానా వద్దకు చేరుకొని అక్కడనుండి తిరుమలకు బయలుదేరివెళ్లనున్నట్లు సమాజం వారు తెలిపారు.

19న నాగండ్లలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఇంకొల్లు, మే 16,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగండ్ల గ్రామంలో వేంచేసిన గంగాపార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 19న ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించేందుకు సర్వంసిద్ధం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మేళతాళాల నడుమ శివనామస్మరణతో మూలవిరాట్, ధ్వజస్తంభానికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యనిర్వాహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావు కోరారు.

నేడు జానపదకళాపీఠం రజతోత్సవం

అద్దంకిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): జానపద కళాపీఠం అద్దంకి రజతోత్సవ వేడుకలు శనివారం స్థానిక బంగ్లారోడ్డులో నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. శుక్రవారం రజతోత్సవ వేడుకలకు సంబంధించిన వివరాలను నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో బౌద్ధం- జానపదం ఉపన్యాస కార్యక్రమం సాయంత్రం 4 గంటల నుండి ప్రజల పాటలు, సాంస్కృతి కార్యక్రమాలు, డప్పు విన్యాసం జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు సభాకార్యక్రమం, అనంతరం సాంస్కృతిక కళా పురస్కారాల సభ జరుగుందని తెలిపారు. ప్రజలందరు హాజరై జయప్రదం చేయాలని కోరారు.





పోలూరు వద్ద పొంగి పొరలుతున్న వాగు, ఉప్పుటూరు వద్ద పొలాల్లో పొగాకు మండెల కిందకు చేరిన నీరు, అకాల వర్షానికి తడిచిపోయిన మిర్చిని ఎండపెట్టిన రైతులు

అకాల వర్షంతో అతలాకుతలం

పొంగి పొర్లిన వాగులు

పర్చూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఉరుములు మెరుపులు, గాలి దుమారంతో కూడిన భారీవర్షంతో ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా కరిసిన వర్షంతో వాగులు, కాలువలు పొంగి పొర్లాయి. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని యద్దనపూడిలో అత్యధిక వర్షపాతం నమోదైంది. దీంతో పోలూరు వద్ద వాగుపొంగి రహదారులపై భారీగా ప్రవహించింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అదే విధంగా ఇంకొల్లు మండలం పూసపాడు వద్ద కప్పలవాగు ఉధృతంగా ప్రవహించింది. ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పాత మద్రాసు రోడ్డు కావడంతో పర్చూరు నుండి ఇంకొల్లు మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించాల్సి ఉంది. వాగు వద్ద ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకుండా ఇంకొల్లు సీఐ రమణయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోలు నిలిపివేశారు. అలాగే పర్చూరు మండలం నూతలపాడు వద్ద నక్కవాగులో భారీగా నీరు చేరటంతో సమీపంలోని పంట పొలాలను ముంచెత్తాయి. వర్షంతోపాటు గాలి దుమారం కూడా తోడుకావటంతో పెద్ద ఎద్ద వృక్షాలు సైతం కూలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పంటలను కాపాడుకొనేందుకు రైతుల పాట్లు

ఒక్కసారిగా అర్ధరాత్రి అకాల వర్షం కురవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. పంటపొలాల్లో ఆరబెట్టిన మిర్చి గాలి దుమారంతో కూడిన భారీ వర్షం పడటంతో తడిచి పోయింది. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో మిర్చిరైతులు అర్ధరాత్రి సమయంలో పంటపొలంలోనే వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతోపాటు వైట్ బర్లీ పొగాకు సైతం కొంతభాగం పొలాల్లోనే ఎండకట్టి ఉంది. అధిక భాగం మండెలు వేసి పరదాపట్టలు కప్పి ఉన్నా గాలిదుమారానికి పట్టలు లేచిపోయి కొంత పొగాకు తడిచి పోయింది. ఇప్పటికే చేతికి అందివచ్చిన పంటను అమ్ముకోలేక అవస్థలు పడుతున్న రైతులకు అకాల వర్షం మరింత ఇబ్బందిని తెచ్చిపెట్టింది.

పంగులూరు :మండల కేంద్రమైన పంగులూరు పరిసర గ్రామాలలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారుజామున 43.3. మిల్లీమీటర్లుగా నమోదయ్యింది. వర్షానికి రోడ్డన్నీ జలమయం కాగా, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పంగులూరు ప్రధాన కూడలిలో రోడ్లకు ఇరువైపులా వర్షపు నీరు నిలిచింది. అమ్మకానికి నోచుకోక ఇళ్ల వద్ద, పొలాలలో మండెల రూపంలో ఉన్న పొగాకు తడవకుండా పరదాలు కప్పేందుకు రైతులు పరుగుపెట్టారు.

ఇంకొల్లు : ఇంకొల్లులో గురవారం అర్ధరాత్రి రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పూసపాడు అడ్డరోడ్డు వద్ద కప్పలవాగు పొంగి ప్రవహించింది. దీంతో రాకపోకలు నిలిచాయి. పొగాకు, మిర్చి రైతులు వర్షం నుంచి పొలాల్లోని పంటను కాపాడుకొనేందుకు అర్ధరాత్రి పరుగుతులు తీశారు. కల్లాల్లో ఉన్న పంటను తడవకుండా ఉండేందుకు ఇబ్బందులు పడ్డారు. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందికి గురయ్యారు.

యద్దనపూడిలో 128 మిల్లీమీటర్ల వర్షం

యద్దనపూడి,(మార్టూరు) : గురువారం రాత్రి నుంచి కురిసిన యద్దనపూడి మండలంలో భారీ వర్షం కురిసింది. 128 మిమీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. దీంతో పోలూరు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. యద్దనపూడి నుండి పోలూరు గ్రామానికి వెళ్లే వాగుపై తూముల చప్టాపై వర్షపునీరు పొంగి ప్రవహించడంతో పోలూరు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్థులు ఈ వాగును దాటకుండా ఉండేవిధంగా మండల తహసీల్దారు కె.రవికుమార్ రెవెన్యూ సిబ్బందిని, ఎస్ఐ రత్నకుమారి పోలీసులను వాగు వద్ద కాపలాగా ఉంచారు. అంతేగాకుండా యద్దనపూడి నుంచి వింజనంపాడు గ్రామానికి వెళ్లే నేలచప్టాపై కూడా భారీగా వర్షపు నీరు ప్రవహించడంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ చప్టా వద్ద కూడా పోలీసులు కాపలాగా సిబ్బందిని ఉంచారు.

విద్యుత్ సరఫరాకు ఆటకం

అకాల వర్షంతో మార్టూరు మండలంలో దాదాపుగా అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మార్టూరు లో నేతాజీ నగర్, రామ్‌నగర్‌లలో గాలులకు చెట్లు పడిపోయాయి. చౌదరినగర్, రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో, చెరువులోని రైస్ మిల్లు వద్ద, పంచాయతీరాజ్ అతిథి గృహాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దాంతో సంపత్‌నగర్‌లో పలు గృహాలలో ఫ్రీజ్‌లు, ఫ్యాన్లు, టీవీలు దెబ్బతిన్నాయి. మండలంలో పలుగ్రామాలలో భారీగా విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మార్టూరు గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్ గుంటూరు సుబ్బారావు, అసిస్టెంట్ లైన్ మెన్ పరసా వేణుగోపాల్‌లు తమసిబ్బందితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు పూర్తిగా విద్యుత్ సరఫరా వచ్చే విదంగా మరమ్మతులు పూర్తిచేశారు.





పంగులూరులో ప్రధాన కూడలిలో నిలిచిన వర్షపునీరు, పోలూరు వాగు వద్ద నిలిచిన రాకపోకలు నీటిలో తడిచిన పొగాకు తాళ్లు

పట్టణంలో ఆహారభద్రత అధికారుల తనిఖీలు

- మూడు దుకాణాల్లో శాంపిల్స్ సేకరణ
- ఒక దుకాణానికి నోటీసులు

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో శుక్రవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆహారభద్రత అధికారి గరికపాటి ప్రభాకర రావు రెండు టిఫిన్ హోటల్స్, ఒక స్వీట్ ఖార్ఖానాలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సమీపంలోని బాలాజీ టిఫిన్ సెంటర్, జానకి టిఫిన్ సెంటర్, అలాగే అను స్వీట్స్‌కు చెందిన ఖార్ఖానాలో తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో అనుమానస్పదంగా కనిపించిన ఆహార పదార్థాలు, పప్పు దినుసులకు సంబంధించి శాంపిల్స్ సేకరించారు. అంతేకాకుండా జానకీ టిఫిన్స్‌కు లైసెన్స్ లేకపోవడంతో వారికి నోటీసులు జారీ చేశారు. సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారుల తనిఖీల తీరుపై విమర్శలు

చీరాల పరిధిలో ఆహారభద్రత అధికారుల తనిఖీలు అపహాస్యంగా ఉంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం నడుస్తున్న ఫాస్ట్ కల్చర్ నేపథ్యంలో నిత్యం అధిక సంఖ్యలో భోజన ప్రియులు, యువతీ యువకులు ఫాస్ట్ ఫుడ్ కల్చర్‌పై మక్కువ పెంచుకు న్నారు. కొన్ని రెస్టారెంట్‌లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్‌ల నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంపై ఎంతమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. నాణ్యతలేని, అపరిశుభ్రమైన ఆహారాన్ని ప్రజలకు అందిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. అయితే ఆహారభద్రత అధికారులు మాత్రం ఫిర్యాదులు అందితేనే తనిఖీలకు రావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా వచ్చిన ప్రతీసారి నోటీసులకే పరిమితమయినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో పట్టణంలో ఆహార కల్తీ యథాతథంగా కొనసాగుతోంది. గతంలోను కొన్ని స్వీటు దుకాణాలు, హోటళ్లపై దాడులు నిర్వహిం చారు. శాంపిల్స్ సేకరించారు. కానీ చర్యలు మాత్రం శూన్యం. ఈ క్రమంలో అధికారులు తీరుపై ప్రజలు అనుమానం చెందుతున్నారు. వాటిని నివృత్తి చేయాలంటే కల్తీ చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

అధ్వానంగా ముక్తేశ్వరం- రామాంజనేయపురం రహదారి

ప్రమాదభరితంగా ఉన్న రోడ్డుపైనే ప్రయాణం

బల్లికురవ. మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముక్తేశ్వరం రామాంజనేయపురం గ్రామాల మధ్య రోడ్డులో ప్రయాణం అంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ రోడ్డును గతంలో తారు రోడ్డుగా అభివృద్ధి చేయగా ఇప్పుడు పూర్తిగా దెబ్బతింది. అలానే ఏబీసీ కాలువ నీరు వచ్చే మేజర్ కాలువపై ఉన్న పైపు కల్వర్టు దెబ్బతిని మట్టిపూర్తిగా కోతకు గురైంది. దీంతో ఈరోడ్డులో రాత్రుళ్లు ప్రజలు ప్రయాణం చేయాలంటే భయం భయంగా వెళుతున్నారు. అలానే రోడ్డు మెత్తం వర్షపు నీరు నిలుస్తుండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకిరువైపులా అడవి తుమ్మచెట్లు పెరగడంతో ప్రయాణం నరకప్రాయంగా ఉందని వారు అంటున్నారు. ఈ రోడ్డు నుంచి మండల ప్రజలు రాష్ట్రీయ రహదారికి నిత్యం ప్రయా ణం చేస్తుంటారని ఇప్పుడు రోడ్డు దెబ్బ తినడంతో ప్రయాణం చేయాలంటే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న కల్వర్టును మరమ్మతులు చేసి రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డులోని ఏబీసీ కాలువ వద్ద కోతకు గురైన మట్టి



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుమ్మచెట్లు

కోటపాడులో పొరుగు ప్రాంత గేదెలు



గ్రామంలో ఉన్న పశువులు

పంగులూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రామంలో గుర్తుతెలియని గేదెలు, దూడలు తిరుగాడుతున్నట్లు గ్రామానికి చెందిన ఉప్పలమర్తి ఏడుకొండలు తెలిపారు. పొరుగు ప్రాంతానికి చెందిన నాలుగు గేదెలు, రెండు దూడలు గ్రామంలో కనిపిస్తున్నట్లు తెలిపారు. పగలు పొలాల వైపు వెళ్లి మేతమేసి సాయంత్రానికి గ్రామంలో రోడ్డు వెంబడి సేదతీరుతున్నట్లు తెలిపారు. గేదెలు గుర్తించిన యజమానులు తమను సంప్రదిస్తే వాటి ఆచూకి తెలుపుతామని స్థానికుడు ఏడుకొండలు తెలిపారు.

శాంతిభద్రతల పర్యవేక్షణకు డ్రోన్ అందజేత



అంజిరెడ్డిని అభినందిస్తున్న ఎస్పీ తూషార్‌డూడీ

బల్లికురవ. మే 16 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు, ప్రత్యేక నిఘా కోసం పోలీసు శాఖకు మండలంలోని కూకట్లపల్లి గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు ఇప్పల అంజిరెడ్డి డ్రోన్‌ను జిల్లా ఎస్పీ తూషార్‌డూడీకి శుక్రవారం అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పోలీసుశాఖ ప్రత్యేక కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా రూ.1.58లక్షల విలువైన డ్రోన్‌ను సమకూర్చినట్లు అంజిరెడ్డి తెలిపారు. బల్లికురవ ఎస్ఐ నాగరాజు సూచన మేరకు జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ, డీఎస్పీ రామాంజనేయులకు దాత బాపట్లలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ, సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు, ఎస్ఐ వై.నాగరాజులు దాత అంజిరెడ్డిని అభినందించారు. నిఘాకు డ్రోన్ ఉపయోగ పడుతుందన్నారు.

చింతచెట్టుకొమ్మ విరిగిపడి మహిళకు గాయాలు

- పర్చూరు -చీరాల రోడ్డులో ఘటన

పర్చూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఎండి పోయిన చింతచెట్టుకొమ్మ విరిగిపడి మహిళకు గాయాలైన ఘటన శుక్రవారం పర్చూరులో చోటుచేసుకుంది. పర్చూరు మండలం సుబ్బారెడ్డిపాలెం గ్రామానికి చెందిన శ్రీదేవి పర్చూరు బొమ్మల సెంటర్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కనే ఉన్న ఎండిపోయిన చింతచెట్టు కొమ్మవిరిగి ఆమె తలపై పడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. పర్చూరు - చీరాల, పర్చూరు -ఇంకొల్లు అర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండిపోయిన చింతచెట్లు ప్రమాదభరితంగా మారాయి. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన నేపథ్యంలో స్థానిక అర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని రెండు ఎండి పోయిన చింతచెట్లను తొలగించి అధికారులు మమా అనిపించారు. ఇప్పటికైనా అర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఎండిపోయి ప్రమాదంగా ఉన్న చింత చెట్లను తొలగించి ప్రజలు, ప్రయాణికులకు హానిలేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న మహిళ



మీద పడిన ఎండుకొమ్మ

వరుస వర్షాలతో ఉప్పు రైతులు బెంబేలు

చినగంజాం, మే 16(ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం తెల్లవారుజామున మేఘాలు గర్జించాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆకాల వర్షాలతో మండల పరిధిలోని ఉప్పు రైతులు బెంబేలెత్తున్నారు. మే నెలలో వరుసగా వర్షాలు కురుస్తుండంతో ఉప్పు రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. సాధరణంగా మే నెలలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండి ఉప్పు దిగుబడులు అధికంగా ఉంటాయి. ఈ నెల ప్రారంభం నుండి వర్షాలు కురుస్తుండడంతో రైతులు నష్టాల ఊబిలో బిక్కు బిక్కుమంటూ భయపడుతున్నారు. ఈ ఏడాది ఉప్పు రేటు ఆశాజనకంగా ఉన్నప్పటికి రైతుల దగ్గర తగినంత నిల్వలు లేవు. అధిక కౌలు రేట్లు వెచ్చించి తీసుకున్న రైతులు ఉప్పు లేకపోవడంతో లబోదిబో మంటున్నారు. ఉప్పు బాగా వస్తున్న సమయంలో భారీ వర్షం కురవడంతో ఉప్పు పంటకు తాత్కాలికముగా విరామం వచ్చింది. భారీ వర్షానికి ఉప్పుమడులు నీట మునిగాయి. మండలంలోని అడవీధిపాలెం, పల్లెపాల్లెం, చినగంజాం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, పెదగంజాం తదితర ప్రాంతాలలో సుమారు మూడు వేల ఎకరాలలో రైతులు ఉప్పుపంటను సాగు చేస్తున్నారు. మడులలో తీత తీయవలసిన, ఎక్కాలపై ఉంచిన ఉప్పు సుమారు 1200 ఎకరాలల్లో వర్షపు నీరు నిలిచి ఉప్పు పంటకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం క్వింటా ఉప్పు బస్తా ధర రూ.350లు ఉంది. ఎకరానికి పదివేల రూపాయిల వరకు నష్టం వాటిల్లిందని ఉప్పు రైతులు తెలిపారు. దీనితో ఉప్పు రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఉప్పు రేటు, అమ్మకాలు ఆశాజనకంగా ఉన్నప్పటికి గత నెల నుండి కురుస్తున్న ఆకాల వర్షాలతో తీవ్రంగా నష్టాలు చవి చూడవలసి వస్తుందని ఉప్పు రైతులు గంటా వెంకటనారాయణ. పీ.శ్రీకాంత్, పీ.శివనారాయణ, ఎస్.వెంకటేశ్వరరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్, మే మాసాలలో ఉప్పు ఇబ్బడి ముబ్బడిగా వస్తుంది. మరల ఉప్పు మడులను సాగు చేసి ఉప్పు తీయటానికి పక్షం రోజులు పడుతుందని రైతులు తెలిపారు. ఈ ఏడాది రుతుపవనాలు కూడా జూన్ మొదటి వారంలో వస్తుండటంతో ఇకపై ఉప్పు రావడం అసాధ్యమేనని ఉప్పు రైతులు భావిస్తున్నారు.

ఆరు లక్షల రూపాయిలు నష్టపోయా- గెల్లి వెంకటలక్ష్మీనారాయణ, ఉప్పు రైతు, చినగంజాం

70 ఎకరాలల్లో తీత తీయవలసిన ఉప్పు తెల్లవారుజామున కురిసిన వర్షానికి కరిగిపోయింది. కౌలుకు తీసుకున్న 70 ఎకరాలలో శుక్ర, శనివారాల్లో ఉప్పు మడులలో తీత తీయవలసిన ఉప్పు కరిగిపోవడంతో ఆరు లక్షల రూపాయిల వరకు నష్టపోవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.



చినగంజాం ప్రాంతంలో నీట మునిగిన ఉప్పు మడులు